నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 22 ఆగస్టు 2024 | www.navatelangana.com

ఏడ్రోజులుగా 'భగీరథ' కార్మికుల ఆందోళన



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎనిమిది నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే తమ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని మండలంలోని రాఘవాపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ వద్ద గత ఏడు రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సమస్యలు పరిష్కరించ కుండా ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తున్నదని మండి పడ్డారు. కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమయానికి జీతాలు వేయాలన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని.. లేని యెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న వారిలో గోపాల్ రెడ్డి, సురేష్, కృష్ణ, బిచ్చప్ప, రాములు, రవి తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ నిధుల దుర్వినియోగంపై అధికారుల విచారణ



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ సొసైటీలో నిధుల దుర్వినియోగం అయ్యాయని జిల్లా డిసివోకు డైరెక్టర్లు, రైతులు పిర్యాదు చేశారు. ఈ విషయంపై బుధవారం మండల కేంద్రమైన టేక్మాల్ సొసైటీ కార్యాలయంలో స్పెషల్ అధికారిగా ఆర్డీవో రమాదేవి విచారణ చేపట్టారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీంచారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి నిధుల దుర్వినియోగంపై అరా తీశారు. పిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పత్రాలను అందజేయాలని సిఇవో వేణుగోపాల్‌కు తెలిపారు. నిధులు దుర్వినియోగం అయినట్లు రుజువైతే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో సొసైటీ చైర్మన్ యశ్వంత్ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకయ్య, డైరెక్టర్లు శ్రీశైలం సత్యనారాయణ, నర్సింహా రెడ్డి, పాపయ్య తదితరులు ఉన్నారు..

సంగారెడ్డి పట్టణ మత్స్యకారులను ఆదుకోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువులో చేపల మృత్యువాతతో జీవనోపాధి కోల్పోయిన గంగపుత్రులను వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువు సుమారు 500 ఎకరాలపై ఉంటుదన్నారు. మున్సిపల్, పీసీబీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ చెరువులోకి మురికి నీరు, కాలుష్యం నీరు చేరి చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. చేపలు మృతి చెందడం పాటు, ఆ ప్రాంతంలో పర్యావరణం దెబ్బ తింటున్నదన్నారు. మృత్యువాత పడిన చేపలకు నష్టపరిహారం అంచనా వేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి రైతు ధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నేడు(గురువారం) నిర్వహించే రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పూర్తిగా రూ.2 లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెబుతూ కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకాలు చేస్తున్నారని.. కానీ కేవలం 40 శాతం రైతులకు కూడా లబ్ధి చేకూరలేదన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాలతో సదాశివపేట మండలంలోని అన్ని గ్రామాల నాయకులు నేటి ఉదయం 10.30 గంటలకు సంగారెడ్డి ఆర్‌డీఓ కార్య లయం వద్దకు చేరుకోవాలన్నారు. ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల రుణమాఫీ గందరగోళం



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ప్రతీ రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గందరగోళంలో పడేసిందని హద్నూర్ సొసైటీ డైరెక్టర్ మాతంశెట్టి ప్రవీణ్ ఆరోపించారు. హద్నూర్ కెనరా బ్యాంక్ నిర్లక్ష్యం వల్ల పలువురికి రుణాలు మాఫీ జరగలేదని కొందరు రైతులు ఆరోపిస్తున్నారన్నారు. నిజమైన రైతులకు మాఫీ జరగకపోవడం సరికాదన్నారు. రుణమాఫీపై నేడు జహీరాబాద్‌లోఆందోళన చేస్తున్నట్టు చెప్పారు.

రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ఆరోపణలు

నవతెలంగాణ-గుమ్మడిదల

గ్రామాన్ని అభివద్ధి చేసిన చిమ్ముల కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని.. కేవలం రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తాజా మాజీ సర్పంచ్ దీపా నరేందర్ రెడ్డి అన్నారు. సర్పంచుల కాలపరిమితి ముగిసి 8 నెలలు గడిచిన తర్వాత.. నాడు సర్పంచ్‌గా ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు గత కొన్ని రోజులుగా తప్పుడు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. దమ్ముంటే గత ఐదేండ్ల తమ పాలనలో ఎక్కడెక్కడ అవినీతి జరిగిందో పత్రాలతో సహా ప్రజల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి.. ఎవరు అవినీతిపరులో తేల్చుకుందామని సవాల్ విసిరారు. గతంలో పంచాయతీ నిధుల గోల్మాల్ జరిగిన విషయంలో జిల్లా ఉన్నత అధికారుల నివేదికల అనంతరం జిల్లా పంచాయతీ అధికారులు చెక్ పవర్ రద్దు చేస్తూ సస్పెన్షన్ వేటు పడిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఇకపై మళ్లీ తాజా మాజీ సర్పంచ్ చిమ్ముల దీపా నరేందర్ రెడ్డి మరియు సిజిఆర్ ట్రస్ట్ పేరుతో అవినీతికి పాల్పడినట్లు ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము కిష్టయ్య, మన్నె బిక్షపతి, తాజా మాజీ ఉపసర్పంచ్ స్వరూప లక్ష్మణ్, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మహేష్ యాదవ్ జింక గోపాల్, రమణ, యశోద, కురుమ వెంకటేష్, భాస్కర్ గౌడ్, యాదగిరి, మల్లేష్, అశోక్, కిష్టయ్య ఎల్లం, శ్రీను, మన్నె సాదయ్య, కొమ్ము రాములు, వీరయ్య, కురుమ కుమార్, కొమ్ము యాదమ్మ, చెంది సుక్కమ్మ, కొమ్ము పద్మ, తదితరులు పాల్గొన్నారు

మాజీ సర్పంచ్ ఇప్ప భూపతిరెడ్డి వివరణ కోరగా.. గ్రామంలోని బీసీలందరికీ బీసీబంధు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. గతంలో డంపు యార్డ్ రహదారి తన సొంత నిధులతోనే వేసుకున్నా. అనంతరం అక్కడ డంపుయార్డ్‌ను నిర్మాణం చేపట్టి.. ఆ రహదారి కూడా నిర్మించినట్టు ఎంబి రికార్డులు చేసుకుని పంచాయతీ నిధుల నుండి తీసుకున్నారన్నారు. బోరు బావులు సుమారు 1000 ఫీట్ల వరకు వేశామని తప్పుడు ఎంబి రికార్డులు చేసుకుని పంచాయతీ నిధుల నుంచి తీసుకున్నారని విమర్శించారు. దమ్ముంటే నయిన్ చెరువు సర్వే నంబర్ 154 లో 5-17 గుంటలు సర్వే నంబర్ 55 లో 6-00 సర్వే నంబర్ 56 లో 5-00 వీటికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 57 సుమారు మూడు ఎకరాల పైచిలుకు ప్రభుత్వ భూమిని పంచాయతీకి అప్పజెప్పాలని సవాల్ విసిరారు. లేని పక్షాన సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీ నిధులను తిరిగి రికవరీ చేయాలని లేని పక్షాన ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇప్ప శేఖర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, దయాకర్ రెడ్డి, పి ప్రభాకర్, గోస్కొండ కిష్టారెడ్డి, ఇప్ప రాంరెడ్డి, పంగ వీరారెడ్డి, జి బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

భారీ వర్షానికి కూలిన పెంకుటిన్లు



నవ తెలంగాణ-చేగుంట

చేగుంట మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెంకుటిల్లు ధ్వంసం అయింది. రుక్మాపూర్ గ్రామానికి చెందిన కట్ట రేఖ, మేకల పెంటవ్వ ఇండ్లు కూలి భారీ నష్టం వాటిల్లింది. శ్రీరామ్ నర్సింలు ఇల్లు పాక్షికంగా కూలింది. వడియారం గ్రామానికి చెందిన ఎండి హాస్య రేకుల ఇల్లు స్వల్పంగా ఒరిగిపోయింది. మండలంలోని పలు గ్రామాలలో అక్కడక్కడ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాడుబడ్డ ఇండ్లలో ఈ భారీ వర్షాల కారణంగా ఎవరు నివసించరాదని, ప్రభుత్వ భవనాల్లో వారు నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, రుక్మాపూర్ పంచాయతీ కార్యదర్శి బాలు, వడియారం కార్యదర్శి జైపాల్ రెడ్డిలు తెలిపారు.

జూదరులపై పోలీసుల దాడి

చిన్న గుండవెల్లి గ్రామంలో 5 గురు అరెస్టు, ఒకరు పరార్

5 ఫోన్లు,6 మోటార్ సైకిల్, స్వాధీనం



నవతెలంగాణ- సిద్దిపేట రూరల్

జూదరులపై పోలీసులు దాడి చేసిన ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో జరిగింది. బుధవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ రూరల్ పోలీస్ సిబ్బంది కలిసి చిన్న గుండవెల్లి గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలిసి జూదం ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై పోలీసులు దాడి చేశారు. 5 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒక వ్యక్తి పరారయ్యాడు. వారి వద్ద నుంచి రూ.2680లు, 5 మొబైల్ ఫోన్లు, 6 మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో పట్టణాలలో ఫామ్ హౌస్ లలో ఇళ్లల్లో , బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

ఆలోచనా విధానం మార్చుకోండి...

- వారధిగా పనిచేయండి
- సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరాలి
- ఆరు గ్యారంటీల అమల్లో అలసత్వం తగదు
- ఐదారు శాఖల్లో నిరంతర పర్యవేక్షణ అవసరం
- రెండు నెల్లకోసారి సమీక్షా సమావేశాలు
- మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ్మ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'అధికారుల ఆలోచనా విధానం మారాలి. ఐదారు శాఖల్లో నిరంతర పర్యవేక్షణ అవసరం. మైనింగ్, ఇరిగేషన్, ఎక్సైజ్, రెవెన్యూ, విద్యుత్ శాఖలకు సుపీరియల్ పవర్స్ ఇచ్చినందున ఆయా శాఖల్లో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా పనిచేయాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా వ్యవహరించాలి. ఆరు గ్యారంటీల అమల్లో అలసత్వం తగదు. సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరాలి' అని రాష్ట్ర అటవీ, దేవాదాయల శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని, అలాగే కలెక్టరేట్ ఆవరణలో క్యాంటీన్‌ను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారుల సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో మైన్స్, క్రసర్స్, ల్యాండ్స్, లేఅవుట్స్, ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలకు తావులేకుండా చూడాలన్నారు. ఇన్‌లీగల్ మైనింగ్‌ను అరికట్టాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మౌళిక సదుపాయాల కల్పన విషయంలో రాజీ పడొద్దన్నారు. స్కూల్స్, ప్రాథమిక, ఇతర ఆసుపత్రుల్లో వారానికి ఒకటి రెండు సార్లు విజిట్ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, తాగునీరు, రుణమాఫీ, కొత్త రుణాల పంపిణీ, చేనేత కార్మికుల సమస్యలు, గృహ జ్యోతి పథకం, ఆర్టీసీ, విద్యా శాఖ, మున్సిపల్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, దేవాదాయ శాఖ, వనమహోత్సవం, నిమ్జ్ భూసేకరణపై సమీక్షించారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెళ్లకే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనింగ్, ఇరిగేషన్, ఎక్సైజ్, రెవెన్యూ విద్యుత్ తదితర శాఖలకు సుపీరియల్ పవర్స్ ఇచ్చిందన్నారు. ఆయా శాఖల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా చూడడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందించాలన్నారు. సంక్షేమ పథకాల అమల్లో అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నందున అధికారులు ప్రతి నెలా లేదంటే రెండు నెళ్లకోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఏమేమీ అందిస్తుంది, ఇంకేం కావాలో శాఖల వారిగా మినిట్స్ రాసుకుని అమలు చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పనితీరుపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి రోగులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.



పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే బాధ్యత అధికారులదే

: అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే బాధ్యత అధికారులదని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అర్హులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందించాలని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా దేవాలయ భూముల్లో దేవాలయాలకు ఉపయోగపడే విధంగా అవసరమైన మొక్కలను పంపిణీ చేసి నాటించాలన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూములు ఆక్రమణకు గురికాకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దేవాదాయ భూములను సర్వే జరిపి సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో టీజీఐడీసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతివల్లూరు, ఎంపీలు సురేష్ షేట్కర్, రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, డీసీసీబీ అధ్యక్షులు చిట్టెం దేవేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృత్యువాత పడిన గేదెలతో పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా

- కాలుష్య జలాల వల్ల గడ్డపోతారం పంచాయతీ పరిధిలో తరచూ మృత్యువాత పడుతున్న పశువులు
- మంగళవారం రోజున రెండు గేదెలు మృత్యువాత
- విచారణకు వచ్చిన పీసీబీ అధికారులు.. అడ్డుకున్న గ్రామస్తులు
- మృత్యువాత పడిన గేదెలతో హైదరాబాద్‌లోని పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా





నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని కిష్టయ్యపల్లి గ్రామంలో కాలుష్య జలాలు తాగి మంగళవారం రోజున రెండు గేదెలు మృత్యువాత పడిన విషయం విధితమే. అయితే ఈ ఘటనకు సంబంధించి పీసీబీ అధికారులు బుధవారం విచారణకు రాగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇప్పటివరకు ఎన్నో ఘటనలు జరిగినా.. ఇలానే తూతూమంత్రంగా విచారణ చేసి గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యా యం చేయాలని మృత్యువాత పడిన గేదెలను తీసుకెళ్లి.. హైదరాబాదులో గల కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం సనత్‌నగర్‌లోని ఎమ్మెస్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కిష్టయ్యపల్లికి చెందిన దాదాపు 12 గేదెల ం(దాదాపు రూ.30లక్షలు విలువ) మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యకారక పరిశ్రమ లపై చర్యలు వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరు వు కుంలను, పంట పొలాలను పచ్చని ప్రకృతిని, మత్స్య సంపదను, సహజసిద్ధమైన వాతావరణంలో విధ్వంసం చేస్తున్న పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి అధికార విభాగం శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెంబర్ సెక్రటరీతో సమావేశం..

ఆందోళనకు దిగిన వారితో పీసీబీ మెంబర్ సెక్రటరీ అధికార బృందంతో సమావేశమయ్యారు. వారం రోజుల్లో పరిశ్రమల వారితో గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గడ్డపోతారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ లు పులిగిల్ల ప్రకాశం చారి, నీరుడి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ మమతా పెంటేష్, మాజీ ఎంపీటీసీలు జానా బాయి ,బాశెట్టి గారి రాజు, నాయకులు అగ్రారం కువ వార్, వేణుగోపాల్ ,వెంకటేష్ పలువురు గ్రామస్తులు మహిళలు రైతులు పాల్గొన్నారు.

శాంపిల్స్ సేకరణ..

కిష్టయ్యపల్లి చెరువు, అయ్యమ్మ చెరువుల్లో నీటి నమూనాలు సేకరించాం. ఈ సంఘటనకు సంబంధించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

- కుమార్ పాఠక్, పీసీబీ ఈఈ

దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న కాలుష్యం

జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిసర గ్రామాల ప్రజలు దశాబ్దాల తరబడిగా కాలుష్యం కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశు సంపద, పంట పొలాలు, పచ్చని ప్రకృతి, మత్స్య సంపద, చెరువు కుంటలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయన్నారు. కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని.. శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

- పులిగిల్ల ప్రకాష్ చారి, మాజీ సర్పంచ్

దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలి

ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

దేశంలో మహిళలకు అనేక విధాలుగా రక్షణ లేకుండా పోతుందని, మన దేశంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ అన్నారు. ఈ మధ్యకాలంలో అనేక రేప్ కేసులు నమోదయ్యాయన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, వారిని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. మహిళలపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. దేశంలో మహిళలపై అఘాత్యాలకు పాల్పడిన వారికి ఉరిశిక్ష వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు సిద్ధూ, అజయ్ పాల్గొన్నారు.

రోటవేటర్‌లో ఇరుక్కుని తెగిన కాలు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సీతారాంపల్లి తండాలో ప్రమాదవశాత్తు రోటవేటర్‌లో కాలు ఇరుక్కుని ఓ యువకుడి కాలు తెగిపోయింది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన లావుద్య శ్రీకాంత్ ఇటీవల తమ రోటవేటర్ రిపేర్ చేయించారు. దున్నడం కోసం రిపేరు చేసిన రోటో వెయిటర్‌ని తనిఖీ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. మరమ్మత్తు చేసిన తర్వాత రోటవేటర్ సరిగా పనిచేస్తుందో లేదో తెలుసుకుందామని లావుడ్యా శ్రీకాంత్ తన స్నేహితుడు అజ్మీర శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజ్మీరా శ్రీకాంత్ ట్రాక్టర్ డ్రైవింగ్ సీట్లో కూర్చుని ఉండగా లావుడియా శ్రీకాంత్ రోటవేటర్ ట్రాక్టర్ మధ్యలో నిలుచుని పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో అజ్మీర శ్రీకాంత్ ట్రాక్టర్ గేర్‌ను మార్చాడు. పొరపాటున రివర్స్ గేరుకు బదులుగా ముందుకు వెళ్లే గేరును మార్చడంతో ట్రాక్టర్ ముందుకు కదిలింది. దీంతో ట్రాక్టర్ రోటవేటర్‌కు మధ్యలో నిలుచున్న లావుడ్యా శ్రీకాంత్ కాలు రోటవేటర్ లో ఇరుక్కుని తెగిపోయింది. వెంటనే చుట్టుపక్కల రైతుల సాయంతో కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌ను ఆసుపత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

- గజ్వేల్ సీఐ బి.సైదా.



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

సైబర్ నేరాల పట్ల ప్రతి విద్యార్థిని విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని గజ్వేల్ సిఐ బి సైదా పేర్కొన్నారు బుధవారం గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ బి. సైదా మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం మొత్తం దుర్భరమవుతుందని తెలిపారు. గ్రామాల, పట్టణాలలోగాని ఎవరైనా గంజాయి అమ్మినట్లు, సేవిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఇతర వివరాలు గుర్తు తెలియని వ్యక్తులకు ఎవరికీ చెప్పవద్దన్నారు. మానవ తప్పిదం వల్ల సైబర్ నేరాలు జరుగుతున్నాయని, టెక్నాలజీ ఉపయోగించుకోవాలన్నారు. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదన్నారు. ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరస్తులు పంపే ఏ లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని అవగాహన కల్పించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై బానిసలు కాకుండా చూసుకోవాలని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థిని నందిని, గంజాయి ఇతర మత్తుపదార్థాల గురించి విద్యార్థులకు చక్కగా వివరించినందున అమ్మాయిని అభినందించారు. విద్యార్థినికి చిరు కానుక, అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కరిముద్దీన్, అధ్యాపకులు, ఏఎస్ఐలు సత్యనారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పథకం దేశంలోనే చారిత్రాత్మకం

- నిబంధనల మేరకు అర్హులందరికీ పథకం వర్తింపు
- మాజీ మంత్రి హరీష్‌ను ప్రజలే రాజీనామా కోరుతున్నారు.
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-వర్గల్

సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న రూ రెండు లక్షల పంట రుణమాఫీ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా గౌరారంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఖజానాపై భారం పడుతున్నప్పటికీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఈ పథకం వర్తింపజేస్తుండగా, జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి రైతుకు పంట రుణమాఫీ వర్తిస్తుందని, ఇందులో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే వివిధ కారణాలతో మిగిలిపోయిన రైతుల వివరాలు సేకరించాలని ఇప్పటికే వ్యవసాయ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అయితే రూ 2 లక్షల పంట రుణమాఫీ అమలు చేస్తున్నందున గతంలో ప్రకటించిన మేరకు ప్రజలే మాజీ మంత్రి హరీష్ రావు రాజీనామాను కోరుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికా బద్ధంగా ఆరు గ్యారెంటీలు పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి ప్రజలు రుణపడి ఉండగా, మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ఎలాంటి తప్పు లేదన్నారు. రాష్ట్రంలో10 ఏళ్ల పాటు అధికారం వెలగబెట్టిన కేసీఆర్ మరి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని నిలదీస్తూ ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి మాజీ ఎంపీపీ మోహన్ , నేతలు బాల్ నర్సయ్య గౌడ్, భాను ప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సందీప్ రెడ్డి, తమ్మలి శ్రీనివాస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నవ తెలంగాణ- గజ్వేల్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యంత అమానుషంగా అత్యాచారం చేసి, హత్య చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ టిఫిటిఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్జీకర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థినిని ఆగస్టు 9వ తేదీన అత్యంత దారుణంగా హింసించి, అత్యాచారం చేసి హత్య చేశారన్నారు. మహిళలకు ఎలాంటి రక్షణా కల్పించలేని పాలకుల, అధికార యంత్రాంగం ఘోర వైఫల్యం మరొక్కసారి వెల్లడైందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, పోలీసులు వాస్తవాల్ని పక్కదారి పట్టించేవిధంగా వ్యవహరించిన తీరు దుర్మార్గమైనదన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న వ్యక్తులను చట్ట పరంగా కఠినంగా శిక్షించి,ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో,హాస్పిటళ్ళలో మహిళా వైద్యుల,నర్సుల ఉద్యోగ రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు రాంచంద్రం, రాజులు, జోన్ కో కన్వీనర్ విద్యాసాగర్ గజ్వేల్, వర్గల్, జగదేవపూర్, ములుగు, మార్కుక్, రాయపోల్ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాపి రెడ్డి, శంకర్ ,పర్వతం నర్సయ్య, రాజయ్య, తాళ్ల నాగరాజు, పిల్లి రాములు, మెట్టు రాములు భాస్కర్ నరసింహులు తుమ్మ సత్యం శ్రీధర్ లక్ష్మయ్య శ్రీనివాస్ యూ కృష్ణ పి ఎల్లయ్య, నరసయ్య డిఎన్ గౌడ్, గోపాల్ రెడ్డి, జయమ, జూనియర్ కాలేజ్ సిబ్బంది టి ప్రభాకర్, రామ్ రెడ్డి, జయరామిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమత్తు కోసం ఎంపీకి వినతి

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని శివానగర్-పెద్దకంజర్ల రోడ్డు ఇబ్బందికరంగా మారిందని.. వెంటన ఆ రోడ్డును బాగు చేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుకు బీజేపీ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షులు సోలక్‌పల్లి జగన్‌రెడ్డి మాట్లాడుతూ.. నరసాపూర్ నుంచి ఈ దారిలో తిరిగే బస్సులు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. అందుకు ఎంపీ స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివనగర్ కమ్మర్, కృష్ణ, ఆదిత్య, సుధాకర్, మహేష్ యాదవ్, కొండరాజు, రాము, మాదారం మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ చైర్మెన్‌ను సన్మానించిన కలెక్టర్

నవతెలంగాణ-జహీరాబాద్



సెట్విన్ చైర్మెన్‌గా గిరిధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి మొదటిసారి హాజరుకావడంతో.. కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆయన్ను సన్మానించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం మరియు ఇందిరా మహిళా శక్తి అభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి గిరిధర్‌రెడ్డిని సన్మానించారు.

డిప్లమా కోర్సు ప్రవేశాలకు అవకాశం

నవతెలంగాణ-న్యాల్‌కల్

వ్యవసాయ డిప్లమా కోర్సు ప్రవేశాల కోసం అవకాశం ఉన్నదని బసంతపూర్ ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు కౌన్సిలింగ్‌కు ఎస్ఎస్‌సీ మార్కుల మెమో, బదిలీ సర్టిఫికేట్, కండక్ట్ సర్టిఫికెట్ పాటు తగిన ఇతర సర్టిఫికేట్లు తీసుకురా వాలన్నారు. ఈనెల 24తేదీలోపు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ వాటర్ టెక్నాలజీ సెంటర్ పిజి టీఎస్ఏయు పరీక్ష కేంద్రానికి వెళ్లి హాజరు కావాలన్నారు.

లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-జహీరాబాద్



మండలంలోని పలువురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి బుధవారం అందజేశారు. మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన చిట్టేపు చంద్రకాంత్‌కు రూ.40,000, అదేవిధంగా పస్తాపూర్ గ్రామానికి చెందిన గుజేరి రాములుకు రూ.50,000 విలువ గల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, శుక్లవర్ధన్ రెడ్డి, యువజన నాయకులు అశ్విన్ పటేల్, నరసింహయాదవ్, నాగిరెడ్డి,రాజ్‌కుమార్, నసేర్, జగదీశ్వర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయండి



నవతెలంగాణ-మనూర్

ఖేడ్ నుంచి నాగలిగిద్దా కారసగుత్తి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే రహదారి పై గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి కార్యాలయ సిబ్బంది సాయన్నకు సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారిపై గుంతలు పడడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు నిండి రోడు కనిపించడం లేదన్నారు. దాంతో ద్విచక్ర వాహనాలు గుంతల్లో కూరుకుపోయి ప్రమాదాలు సైతం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో దంచి కొట్టిన వర్షం

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారంతో పాటు కొడకంచి తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. బుధవారం జిన్నారంలో మార్కెట్ రోజు కావడంతో.. వర్షానికి వివిధ రకాల కూరగాయలు తడిసిపోయాయి. కాగా వర్షం దంచి కొట్టడంతో ఆయా గ్రామాల రైతులు పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి యోగాకు ఎంపికైన గంగారం విద్యార్థులు



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని గంగారం ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయినట్టు ప్రధానోపాధ్యాయులు పండరీ నాయక్ తెలిపారు. గత శనివారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిఐనట్టు చెపాపత్రు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు సదరు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

రేపటి నిరసనకు తరలిరండి

నవతెలంగాణ-సదాశివపేట



జీవో నెంబర్ 28ను వ్యతిరేకిస్తూ రేపు(శుక్రవారం) జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించతలపెట్టిన నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ(తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ సీమ్ ఎంప్లాయిస్ యూనియన్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానంలో కొనసాగుతామని 23 ఆగస్టు 2014 ఇచ్చిన జీవో నెంబర్ 28ని వ్యతిరేకిస్తూ.. సమీకృత కలెక్టరేట్ దగ్గర వద్ద మధ్యాహ్నం 2 గంటలకు ఆ జీవో ప్రతులను పత్రాలను దగ్ధం చేసే కార్యక్రమం ఉన్నదన్నారు. కాబట్టి సంగారెడ్డి జిల్లాలోని ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

రుణమాఫీ దరఖాస్తులు స్వీకరణ



నవతెలంగాణ-న్యాల్‌కల్

రుణ మాఫీ కానీ రైతుల నుంచి న్యాల్‌కల్ రైతువేదికలో గ్రీవెన్స్ సెల్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ తెలిపారు. కాబట్టి రుణమాఫీ జరగని రైతులు ఆందోళన చెందొద్దన్నారు. మాఫీ కోసం రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ స్టేట్మెంట్, పట్టా పాస్‌పుస్తకం తీసుకొచ్చి న్యాల్‌కల్ రైతువేదికలో ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు 270 దరఖాస్తులు వచ్చాయన్నారు.

నేటి ధర్నా జయప్రదం చేయండి

నవతెలంగాణ-జిన్నారం



ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గుమ్మడిదల బస్‌స్టాండ్ చౌరస్తా ప్రాంగణం వద్ద నేడు(గురువారం) నిర్వహించతలపెట్టిన ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్ పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని.. కాబట్టి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖరీఫ్ సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రస్తుత ఖరీఫ్ సాగులో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని హుస్సేన్ నగర్ నూతన ఏఈవో సాయికిరణ్ రెడ్డి, నాగేష్ అన్నారు. మనూర్ మండలం నుంచి చాల్కి క్లస్టర్ ఏఈఓ సాయికిరణ్ రెడ్డి, నాగలిగిద్ద నుంచి హుస్సేన్‌నగర్ నాగేష్ బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. గ్రామాల్లో రుణాల మాఫీ కానివారు రైతులు గ్రామ ఏఈఓలను సంప్రదించాలన్నారు .

బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు

నవతెలంగాణ-మనూర్

రుణమాఫీ డబ్బుల కోసం రైతులు బ్యాంకుల వద్ద ఉదయం నుండి పడిగాపులుగాస్తున్నారు. బ్యాంకు తెరువకముందే గేటు ఎదుట క్యూ కడుతున్నారు. గ్రామాల వారీగా రైతులకు వారాలు కేటాయించినా.. అన్ని గ్రామాల రైతులు నిత్యం బ్యాంకు వస్తుండడంతో రద్దీ పెరుగుతున్నది.

పోలీసు స్టేషన్లకు నూతన హంగులు

- జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ భవనాలకు మరమ్మతులు
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ భవనాలకు మరమత్తులు, నూతన హంగులతో తీర్చిదిద్దడం జరిగిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చాలా కాలంగా మరమత్తులు లేక శిథిలావస్తకు చేరుకుంటున్న జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు, పోలీసు స్టేషన్ భవనాలు మరమత్తులను చేయించి, జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్లకు కొత్తగా పెయింటింగ్ వేయించామన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని.. స్టేషన్‌కు వచ్చిన వారికి కనీస అవసరాలు కల్పించాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. అధికారులు, సిబ్బంది పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, ఫిర్యాది సమస్యను ఓపికగా విని.. వారికి మేమున్నాం అన్న భరోసాను ఇవ్వాలన్నారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, విధి నిర్వాహణలో అలసత్వం చూపొద్దన్నారు. విధి నిర్వాహణలో ఏ మాత్రం ఏమర పాటుగా ఉన్నా.. శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డయల్-100 కాల్స్ విషయంలో బ్లూకోర్ట్ సిబ్బంది త్వరిత గతిన స్పందించాలని, అతి తక్కువ సమయంలో నేర స్థలాన్ని చేరుకున్నట్లైతే నేరం యొక్క తీవ్రతను తగ్గించవచ్చు అని, నేరం జరగకుండ ఆపవచ్చు అన్నారు. ప్రభుత్వ నిషేధిత ఏ ఇతరములు జిల్లా నుండి అక్రమ రవాణా జరగకుండా ముమ్మర వాహన తనిఖీలు చేయాలని సూచించారు.

జహీరాబాద్‌లో భారత్‌బంద్ విజయవంతం



నవతెలంగాణ-జహీరాబాద్

భారత్‌బంద్‌లో భాగంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాలలు, మాల మహానాడు కార్యకర్తలు జహీరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఆర్టికల్ 341కు వ్యతిరేకమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయుకులు అన్నారు. ఈ సందర్భంగా సమతా సైనిక్ రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు, రాజకీయ పార్టీలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయన్నారు. రిజర్వేషన్ బచావో సంఘర్షణ సమితి బహుజన సమాజ్ పార్టీ మాయావతి, లోక్ జనశక్తి పార్టీ కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్, రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే, చంద్రశేఖర్ ఆజాద్, మాల మహానాడు ఉత్తర భారతదేశంలోని మాదిగలంతా ఎస్సీ వర్గీకరనను వ్యతిరేకిస్తు న్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పంజాబ్ హైకోర్టు, ఐదుగురు జడ్జీల సుప్రీం కోర్టు ధర్మాసనం ఏ ఆర్టికల్స్ ప్రకారమైతే వర్గీకరణ చెల్లదని చెప్పాయో.. అవే ఆర్టికల్స్ ప్రకారం ఇప్పుడు వర్గీకరణ చేయెచ్చని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. రాజ్యాంగ సవరణ జరగకుండా ఆర్టికల్స్ మార్చకుండా వర్గీకరణ చేయాలని చెప్పడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు క్రిమిలేయర్ను అమలు చేయాలని చెబితే దాన్ని అమలు చేయమని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయకపోవడం తన ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. వెంటనే ఎస్సీ వర్గీకరణను క్రిమిలేయర్‌ను ఉపసం హరించుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఆకాష్, సమతా సైనికులు నాయకులు కర్ల రవికుమార్, కేవీపీఎస్ నాయకులు మహేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దళితులపై జరుగుతున్న కుల వివక్ష దాడులు అరికట్టాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



దళితులపై జరుగుతున్న కుల వివక్ష దాడులు అరికట్టాలని.. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా దళితులకు ఇచ్చిన అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కేవపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, న్యాయవాది కొర్మోని సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) నారాయణఖేడ్ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సుభాష్ హాజరై మాట్లాడుతూ. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏండ్లు గడిచినా.. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితుల స్థితిగతులో మార్పు ఏమి లేదన్నారు. దేశవ్యాప్తంగా రోజురోజుకు దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మైనార్టీలు, మహిళలపై పెద్ద ఎత్తున వివక్ష దాడులు, లైంగికదాడులు జరుగుతున్నాయ న్నారు. వాటిని అరికట్టడంలో పాలకులు పూర్తిగా విఫలవయ్యారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో దళితులకు అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా రూ.12 లక్షల పూర్తి సబ్సిడీతో లోన్లు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటివరకు ఎటు వంటి కార్యచరణలేదన్నారు. వెంటనే అది అమలు చేయాల న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్, గురుకుల విద్యా ర్థులకు పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీల ను వెంటనే పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.. లేని పక్షంలో దళితులని సంఘటితం చేసి పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు రమేష్, సతీష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 24,25 తేదీల్లో చేపడుతున్న ఎస్ఎఫ్ఐ విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏరోళ్ల మహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో సంగారెడ్డిలో విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, విద్యా వ్యతిరేక విధానాలపై, సమాజంలో వస్తున్న మార్పులపై, సమాజ అభివృద్ధికై ఉపయోగపడే విధంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, మేధావులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వం పాల్గొని తరగతులను బోధిస్తార న్నారు. శాస్త్రీయమైన విద్యా విధానం కోసం విద్యా కార్పొరేటీకరణ, కాషాయకరణకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నదన్నారు. విదేశీ యూనివర్సిటీలు తీసుకు వచ్చి ఉన్నంత విద్యా వ్యవస్థను కార్పొరేట్‌కు అప్పజెప్పే విధంగా కేంద్ర ప్రభుత్వం చూస్తుందని.. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అమ్మేస్తున్నదన్నారు. విద్యా రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు. జిల్లాలో విద్యార్థి సంఘం ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటానికి పదును కట్టేందుకు జరుగుతున్న విద్యార్థుల శిక్షణా తరగతులను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు,శ్రీను, నాయకులు, నవీన్, నితిన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-కొండాపూర్

మండలపరిధిలోని గొల్లపల్లి గ్రామంలో సంగారెడ్డి వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హెల్త్ మెగా క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో సుమారు 100 మందికి పైగా ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. వెల్నెస్ హాస్పిటల్ అన్ని సౌకర్యాలు కలిగి ఉండి.. పేదలకు అందుబాటులో ధరల్లో వైద్యం అందుతున్నదన్నారు. రోగులకు ఎక్కువ సమస్యలు ఉన్నవారికి సంగారెడ్డి హెడ్ క్వార్టర్స్‌కి రిఫెర్ చేసి కావాల్సిన ట్రీట్మెంట్ అందిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ మౌనిక, డా.హరిత, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, వార్డ్ మెంబెర్ సత్యనారాయణ పంచాయతీ సెక్రటరీ నౌషాద్ ఫాతిమా, హాస్పిటల్ సిబ్బంది రాములమ్మరిదాయ్, చౌలదీప్, ప్రభుదాస్,మోహన్, సమేల్ తదితరులు పాల్గొన్నారు.



చౌటకూర్ నూతన ఏఈఓగా ప్రవీణ

నవతెలంగాణ-చౌటకూర్

నూతన చౌటకూర్ మండల మొదటి వ్యవసాయ అధికారిణిగా(ఏఈఓ) ప్రవీణ నియమితులయ్యారు. ఈ మేరకు ఉమ్మడి పుల్కల్ మండల్ ఏవో చైతన్య చౌటకూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. జహీరాబాద్‌లో పనిచేసిన ప్రవీణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండి తమ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి దత్తు, జనార్ధన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా అనితరెడ్డి

నవతెలంగాణ-మునిపల్లి



మండల వ్యవసాయ అధికారిగా అనితరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన శివకుమార్ పటాన్ చెరువుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సదాశివపేట ఏవోగా విధులు నిర్వహించిన అనితరెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఏఈవోలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

కల్లుగీత వృత్తిలోకి రెడ్డి కులస్తులను అనుమతించొద్దు

నవతెలంగాణ-సంగారెడ్డి



కల్లుగీత వృత్తిలోకి రెడ్డి కులస్తులను అనుమతించొద్దని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి ఓఎస్ వనిజా దేవి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్ మాట్లాడుతూ.. గుమ్మడిదల గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సొసైటీ ఉన్నప్పటికీ.. ఆ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి తన భూమిలో ఉన్న ఈత చెట్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇతరులతో ఈత చెట్లకు కల్లు గీసి అక్రమంగా అమ్ముకొని వ్యాపారం చేస్తున్నారన్నారు. దాంతో గుమ్మడిదల సొసైటీ గీతా కార్మికులకు కల్లు అమ్ముడుపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాగే అయితే వాళ్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అక్రమంగా కల్లు గీసి అమ్ముతున్న లక్ష్మారెడ్డి పై చర్య తీసుకోవాలనిడిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు చేసుకునే లక్ష్మారెడ్డి.. సొసైటీలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకుంటే దానికి వత్తాసు పలుకుతూ జిల్లా ఎక్సైజ్ అధికారులు కల్లుగీత సొసైటీకి నోటీసులు ఇవ్వడం దారుణ మన్నారు. వెంటనే ఆ దరఖాస్తును జిల్లా ఎక్సైజ్ అధికారులు తిరస్కరించాలన్నారు. గత ప్రభుత్వం గౌడ, ఈడిగా అనేరెండు కులాలు మాత్రమే కల్లు, నీర తీసి అమ్మాలని జీవోను విడుదల చేసినప్పటికీ.. ఈ వృత్తిలోకి రెడ్డి కులస్తులు అడుగుబెట్టాలని చూడడం సరికదన్నారు. కాబట్టి కల్లుగీత వృత్తిలోకి రెడ్డి కులస్తులను అనుమతించొద్దని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది శశిధర్, అన్వర్, నదీమ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు, ప్రతాప్ గౌడ్ కృష్ణా గౌడ్ శ్రీనివాస్ గౌడ్, రవి గౌడ్, పరశురామ్‌గౌడ్, సంగమేష్ గౌడ్, హరీష్‌గౌడ్, కమలాకర్ గౌడ్, స్వామి గౌడ్, ప్రతాప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీటి ట్యాంక్ కోసం ఆర్థికసాయం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యానికై వాటర్ ట్యాంక్ ఏర్పాటు నిమిత్తం జోగిపేటకు చెందిన అడ్వకేట్ కీ.శే శెట్టి శివరావు జ్ఞాపకార్థం రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, 1976 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థి పి.మృత్యుంజయం రూ.50,000 వేల విరాళాన్ని అందజేశారు. బుధవారం స్థానిక పాఠశాలలో వాటర్ ట్యాంక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 1976లో జోగిపేట ఉన్నత పాఠశాల నుంచి ఎస్ఎస్‌సి ఉత్తీర్ణత పొంది ఉన్నత చదువులతో పంచాయతీ రాజ్ శాఖలో చీఫ్ ఇంజనీర్ గా పదవీవిరమణ పొందినట్టు చెప్పారు. చదువుకున్న పాఠశాల అంటే అత్యంత అభిమానమని, ఈ పాఠశాలకు తనవంతు సేవగా విరాళమందించడం జరిగిందన్నారు. 1976 బ్యాచ్ తరపున పాఠశాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం ఆయనకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ కుమార్, ఎంఈఓ కృష్ణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల మానయ్య, మండల అధ్యక్షులు ఎస్.నరోత్తం కుమార్, పాఠశాల పీడీవ శ్రీనివాస్, నాయకులు మంజ నాయక్, రమేష్, తదితరులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1976 ఎస్ ఎస్ సి బ్యాచ్ మిత్రులు బస్వ సత్యప్రకాష్, రంగ ప్రభుప్రకాష్, రమేషప్ప, తిమ్మిగారి పాండు, వడ్ల రాములు, ఔసలి ప్రభాకర్, లక్ష్మణ్, ప్రభు శంకర్, వీరేశం లు పాల్గొన్నారు.

కళాశాలల్లో అక్రమ డొనేషన్ల దందాను అరికట్టాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యాలు పెద్ద ఎత్తున డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, వాటిని అరికట్టాలని, అక్రమంగా డొనేషన్లు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో కేవీపీఎస్ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ.. ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలు.. మేనేజ్మెంట్ కోట సీటు కోసం ప్రతీ విద్యార్థి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అక్రమంగా డొనేషన్లు, ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. ప్రతీయేడు రూ.25శాతం ఫీజుల పెంపు, ఇదిగాక హాస్టల్ ఫీజు అడ్మిషన్ ఫీజు పేరుతో వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. అనేక ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కనీస సౌకర్యాలు, అర్హులైన ఫ్యాకల్టీ సరైన ల్యాబ్స్ లేక విద్యార్థులు పెద్ద ఎత్తున నష్టపోతున్నా పట్టించుకోని యాజమాన్యాలు.. అదనపు కోర్సులు, అదనపు సెక్షన్ల కోసం ప్రభుత్వం అనుమతులు తీసుకొని పెద్దఎత్తున డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ విద్య పూర్తిగా వ్యాపారమైయిందని.. దాంతో పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షలా మారుతున్నదన్నారు. అక్రమంగా డొనేషన్లు వసూలు చేస్తున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని.. ఆ కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, మలేశం జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్, దాస్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ



నవతెలంగాణ-జోగిపేట

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జోగిపేట పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను, వాణిజ్య వ్యాపార సంస్థలను కూడా బంద్ చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మాలలను దెబ్బతీసేందుకే వర్గీకరణ పేరుతో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు లక్ష్మణ్, దీనబంధవ్, మొగు లయ్య, రాజు, ప్రసాద్, గోపాల్, మహేష్, మల్లేశం, కరుణా కర్, జంగం మహేశ్, మొగులయ్య, రవికుమార్, దుర్గయ్య మరియు బేగరి నాగేష్,పరిపూర్ణ పోచయ్య కిష్టయ్య తదితరుల పాల్గొన్నారు.

విద్యార్థులకు నీటి వసతి కల్పన

నవతెలంగాణ-ఝరాసంగం



మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గత కొంతకాలంగా నీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిలకు గురయ్యేవారు. దాంతో విద్యార్థులు బాత్రూంలోకి వెళ్లేందుకు గాని, భోజన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం మాజీ ఎంపీటీసీ సంగీత గుండప్ప, పంచాయతీ కార్యదర్శి నర్సిములు చొరవతో పాఠశాలకు నీటి వసతి కల్పించి సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యార్థులు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు నాగేశ్వర్, ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, ప్రవీణ, లత, రామకృష్ణ, గోపాల్, తుక్కప్ప, పంచాయతీ సిబ్బంది అశోక్,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ రామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ రామచంద్ర స్వామి ఆలయ భూమి పూజ బుధవారం జరిగింది. జిన్నారం మాజీ ఎంపీపీ డి.రవీందర్ గౌడ్, గుమ్మడిదల దేవాలయ కమిటీ చైర్మెన్ పడమటి లక్ష్మారెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, మాజీ ఉపసర్పంచ్ ఎం.నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీ గుమ్మడిదలలో రామచంద్రస్వామి ఆలయం నిర్మాణాన్ని చేపడుతున్న ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అ ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండలి తులసీదాస్, ఆలయ ప్రధాన కార్యదర్శి చిమ్ముల దేవేందర్‌రెడ్డి, పి శ్రీనివాసరెడ్డి, మేకల యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని వారికి త్వరలో పరిష్కారం

● వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేసిందని సాంకేతిక లోపం వలన ఎవరికైనా రుణాలు మాఫీ కానట్టుగా వచ్చినట్లయితే వారికి త్వరలో పరిష్కారం లభిస్తుందనీ మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు. చుట్టుముట్టు గ్రామాల ప్రజలు వ్యవసాయ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఆయన ఈ సందర్భంగా నిజాంపేట మండల కేంద్రంలో నీ రైతు వేదికలో విలేకరులతో మాట్లాడుతూ రెండు లక్షల వరకు రుణమాఫీ కానీ వారు ఎవరైనా ఉంటే సాంకేతిక లోపం జరిగి ఉంటుందని వారికి త్వరలో పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ వస్తుందని అధైర్యపడవద్దన్నారు. బ్యాంక్ అధికారుల నుంచి కానీ ఇతరత్రా ఏవైనా పొరపాట్లు జరిగినచో సరి చేసిన తర్వాత కలెక్టర్ ఆధ్వర్యంలో పరిష్కారం లభిస్తుందన్నారు. కావున రైతులందరూ సమన్వయం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్‌లో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలో గురువారం ఉదయం 11 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయం సెల్లార్‌లో టెన్త్ క్యాంపు, హెల్త్ క్యాపులు మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, సీఅండ్‌డీఎంఏ ఆదేశాల మేరకు వర్షాకాలం దృష్ట్యా చేయవలసిన పనులు గ్రాస్ కట్టింగ్, ఫాగింగ్, స్ప్రేయింగ్, అయిల్ బాల్స్ మొదలగు పనులు చేయుటకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

ప్రాథమిక పాఠశాల గదుల చుట్టూ ఫినిషింగ్ వల



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో నిత్యం కోతులు చేరి విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్నాయి, ఇదే కాక బ్యాగులు, పుస్తకాలు, పిల్లల చేతిలో తినుబండరాలు ఏవి కనిపించినా పిల్లలపై దాడి చేసి ఎత్తుకెళ్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న సామాజిక సేవకుడు అయిత పరంజ్యోతి బుధవారం ప్రాథమిక పాఠశాల తరగతి గదుల చుట్టూ ఫినిషింగ్ వలను ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని, పాఠశాలకు వల ఏర్పాటు చేశానని, కోతులు లోనికి రావాలంటే భయపడతాయన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకోవాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలత, సామాజిక సేవకుడైన అయిత పరజ్యోతి తక్షణమే తమ పాఠశాల సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలే నరేంద్ర సేవలు చిరస్మరణీయం

● పేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విట్టల్.



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి దివంగత ఆలే నరేంద్ర చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో దివంగత ఆలే నరేంద్ర జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ప్రాంతానికి ఆలే నరేంద్ర ఎంపీగా, కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో అన్ని విధాల అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు ఎప్పటికీ నిలిచిపోతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు బండల శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ సుభాష్.. ఎర్ర శ్రీహరి, బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద శంకరంపేటలో వృద్ధులకు వైద్య శిబిరం



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద శంకరంపేటలోని యునాని ఆసుపత్రి వద్ద బుధవారం వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానాల ద్వారా సులువైన చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. ఆయుష్ అనగా సాంప్రదాయ వైద్య విధానాల సమాహారం, ఆయుర్వేదం యోగ ప్రకృతి చికిత్స యునాని హెూమియోపతి అని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు డాక్టర్ రజిని యునాని వైద్యురాలు కన్నీరున్నీసా ఫార్మసిస్ట్ ప్రియా కుమారి సుస్మిత సిబ్బంది జాఫర్ సాయిలు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలి

● పేట ఎస్సై శంకర్.



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని పెద్దశంకరంపేట ఎస్సై శంకర్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలోని ఉత్తులుర్ అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ప్రజలకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. నేరాలు శిక్షలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

మండలానికి ఇద్దరు ఏఈవోలు



నవతెలంగాణ-కౌడిపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీల్లో భాగంగా కౌడిపల్లి మండలానికి ఇద్దరు మండల విస్తీర్ణ అధికారులు బదిలీపై వచ్చారు. వ్యవసాయ శాఖలో కొన్ని సంవత్సరాలుగా వెంకట్రావుపేట క్లస్టర్ విధులు నిర్వహించిన మండల విస్తీర్ణ అధికారిగా రాజశేఖర్ గౌడ్ బదిలీపై కొల్చారం మండలం రంగంపేట క్లస్టర్‌కు వెళ్లారు. కౌడిపల్లి మండల విస్తీర్ణ అధికారిగా సాహితి వచ్చారు. వెంకట్రావు పేట్ క్లస్టర్ విస్తీర్ణ అధికారిగా సౌజన్య వచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పంటలపై సూచనలు ఇస్తామని తెలిపారు మండలంలోని రైతులందరూ తమకు సహకరించాలని వారు కోరారు.

గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రం ఎన్జీవోఎస్ కాలనీలో అన్నం మహేష్, అన్నం ఆంజనేయులు వేద పండితులతో బుధవారం నూతన గృహప్రవేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ గృహప్రవేశానికి చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ హాజరై పూజలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారికి బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుడ్డ భాగ్యరాజ్ , ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన మండల అధ్యక్షుడు



నవతెలంగాణ-నార్సింగి

లబ్దిదారునికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మైలారం బాబు బుధవారం అందజేశారు. నార్సింగి గ్రామానికి చెందిన గౌడ ఎల్లా గౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందాడు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా ఆయనకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో చెక్కు మంజూరు కాగా బాబు బీఆర్ఎస్ నాయకులతో పాటు లబ్ధి దారుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కొత్త ప్రభాకర్ రెడ్డి ఎల్లప్పుడూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తారన్నారు. చెక్కును మంజూరు చేయించినందుకు ఎల్లా గౌడ్ ఎమ్మెల్యేకు, సహాయ సహకారాలు అందించిన బాబు, బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు శ్రీపతి రావు, పీఏసీఎస్ చైర్మన్ శశీధర్ రెడ్డి తాజా మాజీ వార్డు సభ్యులు జోగు జీవన్ కుమార్, ఎండి జమీర్, నాయకులు అబ్దుల్ రెహ్మాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రౌండ్ బెస్ట్ లర్నింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలి ఘనపూర్

గ్రౌండ్ బెస్ట్ లర్నింగ్ కార్యక్రమంను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని ఎంపిక చేయబడిన 20 మంది విషయ నిపుణులకు గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రంలపై జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాధికారితో కలిసి గ్రౌండ్ బెస్ట్ లర్నింగ్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను అర్థవంతంగా నిజ జీవితంలో ఉపయోగించుకునే విధంగా తయారు చేయాలని, ఆ దిశగా కంటెంట్ రూపొందించాలని వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విషయ నిపుణులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరు నుంచి పదవ తరగతి వరకు తరగతిల వారీగా పైన తెలిపిన సబ్జెక్టుల వారిగా తయారు చేయాలని, తదుపరి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో అమలు చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ పాఠశాల నుంచి వచ్చిన విషయ నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

ఏబిసిడి వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

● కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను, వాటి ఉప కులాలను విభజించి పాలించే ఆలోచన మానుకోవాలి



నవతెలంగాణ-మెదక్ టౌన్

సుప్రీం కోర్టు తీర్పుని వ్యతిరేకిస్తూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్దకు ర్యాలీ చేపట్టి బస్ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అల్లూరి సంజీవ మాట్లాడుతూ ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాదని, మోడీ ప్రభుత్వం ఇచ్చిన తీర్పు అని, ఇది భారత రాజ్యాంగానికి పార్లమెంట్లో 1/3 మెజారిటీతో చేయాల్సిన చట్టాన్ని సుప్రీం కోర్టుని చేతుల్లో పెట్టుకొని ఏకపక్ష తీర్పునివ్వడం జరిగిందని విమర్శించారు. దీని వల్ల ఎస్సీ ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతుందని విద్య ఉద్యోగ రిజర్వేషన్లలో యువత నష్టపోతుందని సామాజికవర్గం సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఇంకా వెనకబడిపోతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరుచుకొని ఎస్సీలను విభజించి పాలించే ఆలోచన ధోరణి మానుకోవాలని లేదంటే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊరట్ల శివ, జిల్లా ఉపాధ్యక్షులు జెల్ల రమేష్, తాళ్ల ఆనంద్, జిల్లా యువత అధ్యక్షులు దాడిగ నరేష్, మెదక్ పట్టణ అధ్యక్షులు బత్తుల ప్రసాద్, బి ఎస్ పి జిల్లా అధ్యక్షులు డొంకని సిద్దిరాములు, వెల్దుర్తి మండల అధ్యక్షులు కుమార్, జాతీయ మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

బదిలిపై వెళ్లిన అధ్యాపకులకు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-మెదక్ టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్‌లో ఇటీవల జరిగిన బదిలీల సందర్భంలో, కళాశాల నుంచి బదిలీపై ఇతర కళాశాలకు వెళ్లిన అధ్యాపకులు, సిబ్బందికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ, కొత్తగా కళాశాలకు వచ్చిన సిబ్బందికి హృదయపూర్వకంగా స్వాగతం పలికే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్, ఎన్సిసి ఆఫీసర్, అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా సేవలందించిన ఆర్థిక శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ ఆకుల సుధాకర్, అడ్మిషన్స్ కోఆర్డినేటర్‌గా సేవలందించిన డాక్టర్ దినకర్, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లగా, హిందీ సహాయ ఆచార్యులు అన్నపూర్ణ, మహబూబాబాద్ ప్రభుత్వ కళాశాలకు, రాజనీతి శాస్త్ర సహాయ ఆచార్యులు సమీరా నజ్నీన్, నర్సాపూర్ ప్రభుత్వ కళాశాలకు బదిలీపై వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ రమణ, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. హుస్సేన్ బదిలీ అయిన అధ్యాపకులు కళాశాల అభివృద్ధి కోసం చేసిన విశేష కృషిని స్మరించుకుంటూ వారిని అభినందించారు. అదేవిధంగా, కొత్తగా కళాశాలకు వచ్చిన సిబ్బందికి స్వాగతం పలుకుతూ, కళాశాల పరిపాలనలో వారితో కలిసి మరింత సాఫల్యాన్ని సాధిస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. బదిలీపై వెళ్తున్న అధ్యాపకులు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుభవాలను పంచుకుంటూ ఈ కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉందని, ఇక్కడి విద్యా వాతావరణం, సౌకర్యాలు వాళ్ళ అభివృద్ధికి ఎంతగానో సహకరించాయని తెలియజేశారు. ఈ సమావేశంలో కొత్తగా కళాశాలకు వచ్చిన డాక్టర్ నాగేంద్రరావు, డాక్టర్ శ్రీలత, నరేందర్, డాక్టర్ మల్లేశం, నూతన ఏవోగా ఆంజాద్ అలీ, సీనియర్ అసిస్టెంట్ ఓం ప్రకాష్, కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్ రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం సభ్యులు గణపతి, వెంకటేశ్వర్లు, శరత్ రెడ్డి, వేణుగోపాల శర్మ, డాక్టర్ చంద్రశేఖర్, రాజా గౌడ్, విశ్వనాథ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు కుట్టడంలో మహిళలే కీలకం



నవతెలంగాణ-తూప్రాన్

మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ఏకరూప డ్రెస్సులను కుట్టడంలో మహిళలే కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సమైక్య సంఘాలకు ఉపాధిని కల్పించాలని ఆలోచనతో ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యత అప్పగించినది. దీంతో మండల సమైక్య సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో పనిచేసే సమైక్య సంఘాల లీడర్లు మహిళలు ఏకరూప దుస్తులను కుట్టే బాధ్యత తీసుకున్నారు. తూప్రాన్ మండల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమికోన్నత,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు అన్ని కలిపి 21 పాఠశాలలు ఉన్నాయి. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి విడతలో 807 మంది బాలికలకు, 857 మంది బాలురకు మొత్తం 1664 మంది విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులను మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు వివోఏల ద్వారా పంపిణీ చేశారు. 30 మంది మహిళా సమైక్య మహిళలు ఏకరూప దుస్తులను కుట్టారు. 2వ విడతకు సంబంధించిన ఏకరూప దుస్తులను కుడుతున్నారు.

త్వరలో 2 వ విడత ఏకరూప దుస్తువుల పంపిణీ

2వ విడతలోని 2వ జత ఏకరూప దుస్తువులను మండలంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల పలుగుడ్డ తండా, అమ్నాపూర్ తాండ, రెడ్యా నాయక్ తండ, వెంకట రత్నాపూర్, జాండపల్లి, దాతర్ పల్లి, ఇమాంపూర్, ఇస్లాంపూర్, పి టి కోనాయిపల్లి మొదలగు 9 పాఠశాలల్లో మరో 2 రోజుల్లో ఏకరూప దుస్తులను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక డ్రెస్‌కు రూ. 150లు చెల్లించాలి

మండల సమైక్య ఆధ్వర్యంలో ఏకరూప దుస్తువులను గ్రామ సమైక్య సంఘాల మహిళలు రూపాయలు రూ.50 కే ఒక డ్రెస్ ను కుట్టడం జరిగింది. వివోఏ మహిళలు నష్టపోతున్నారనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి రావడంతో,దాన్ని కాస్త 75 రూపాయలకు పెంచి బిల్లులను మంజూరు చేస్తున్నారు. అయితే గ్రామ సమైక్య సంఘాల మహిళలు,మండల సమైక్య నాయకురాల్లు ఒక యూనిఫామ్ కు ఇచ్చే కుట్టుకూలి రూ 75 ల నుంచి రూ 150 లకు పెంచి ఇవ్వాలని కోరుతున్నారు.

నెలాఖరులోగా దుస్తుల పంపిణీ పూర్తి చేస్తాం

ఏపిఎం రుక్మిణి



2వ విడతలోని 2వ జత ఏకరూప దుస్తులను పంపిణీ ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేస్తామని తూప్రాన్ ఏపిఎం రుక్మిణి తెలిపారు. 2వ విడతలోని ఏకరూప దుస్తులకు కాజాలు, బటన్స్ కుట్టగానే పూర్తిస్థాయిలో మండలంలోని అన్ని పాఠశాలలకు యూనిఫామ్‌లను అందజేస్తామన్నారు. 2వ విడతలోని 2వ జత ఏకరూప దుస్తులు మండల వ్యాప్తంగా 1664 ఏకరూప దుస్తులను విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అందిస్తామన్నారు. వీటికి సంబంధించిన బడ్జెట్ కూడా రావాల్సి ఉన్నది. ఇదివరకే విడుదలైన మొదటి విడత బిల్లులు, ఒక డ్రెస్‌కు రూ 50ల చొప్పున మొత్తం రూ 69,500లు మండల సమైక్య సంఘం అకౌంట్‌లో జమ చేయనున్నట్లు ఏపిఎం రుక్మిణి తెలిపారు.

నిండుకుండలా హెచ్‌పీ పెట్రోల్ బంక్

● ఇబ్బంది పడ్డ వాహనదారులు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రం మక్క రాజుపేట, గజ్వేల్ మీదుగా వెళ్లే దారిలో హెచ్‌పిపెట్రోల్ బంక్ ఉంది. ఆ దారిలో నిత్యం చాలా వాహనాలు వెళుతుంటాయి, వెళ్లే వాహనదారులకు అందుబాటులో పెట్రోల్, డీజిల్ లభిస్తుంది. అయితే మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హెచ్.పి పెట్రోల్ బంక్‌లో వర్షం నీరు చేరి నిండుకుండను తలపించడంతో వాహనదారులతోపాటు, పెట్రోల్ యజమాని, పనిచేసే సిబ్బంది చాలా ఇబ్బంది పడ్డారు. భారీ వర్షం కురవడంతో పక్కనే రెండు పెద్ద ప్రైవేటు కంపెనీలు ఉండడంతో నీరు కూడా వరద రూపంలో భారీగానే చేరుకుంది. భారీ వర్షానికి నిండిన నీరును బుధవారం హెచ్‌పి పెట్రోల్ బంక్ యజమాని రెండు పంపు మోటార్లు ఏర్పాటు చేసి బయటికి పంపించే ప్రయత్నం చేశారు. నిత్యం వెళ్లే వాహనదారులు ఇక్కడ పెట్రోల్, డీజిల్ లభిస్తుందని నమ్మి వచ్చిన వాహనదారులకు నిరాశే ఎదురయింది. పెట్రోల్ బంక్‌లో నీరు నిలవడంతో లోపలికి వెళ్లడానికి వీలు లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు, వర్షం భారీగా పడినప్పుడు నీరు నిల్వ ఉండకుండా పెద్ద అండర్ డ్రైనేజీ వేసి పూర్తి నీరు బయటికి వెళ్ళిపోయేలా చేస్తే బాగుంటుందని వాహనదారులు అంటున్నారు. పెట్రోల్ లేక నానా ఇబ్బందులు పడ్డామని వాహనదారులు తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిటిడిఓ



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల, గిరిజన బాలుర వసతి గృహాన్ని బుధవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ సందర్శించారు సందర్శనలో భాగంగా పాఠశాల రికార్డులను ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. పాఠశాల వసతులు భోజనం గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు . ఉపాధ్యాయుల బోధనేతర సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ జయరాజు ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా శీలం బాల్రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

హవేలీ ఘనపూర్ మండల వ్యవసాయ అధికారిగా శీలం బాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిలిపిచెడ్ మండలంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తించిన బాల్‌రెడ్డి బదిలీపై హవేలీ ఘనపూర్‌కి వచ్చారు. హవేలీ ఘనపూర్ లో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన నాగమధురి బదిలీపై పాపన్నపేట్‌కి వెళ్ళారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కరెంట్ వాడుకున్న వ్యక్తికి జరిమానా



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్ అల్లాపూర్ స్ట్రీట్ లైట్స్‌కు సంబంధించిన కరెంటును అక్రమంగా వాడుకున్న వ్యక్తికి మున్సిపల్ అధికారులు మేనేజర్ రఘువరన్ రూ. 8 వేల జరిమానా విధించారు. అల్లాపూర్ రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి కండెల దుర్గయ్య అక్రమంగా విద్యుత్‌ను వాడినందుకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, బి.బాబు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెమో రైలు తిరిగి ప్రారంభించాలి

● ఎంపీకి వినతి పత్రం



నవతెలంగాణ-చేగుంట

కరోనా కంటే ముందు డెమోరైలు నిజామాబాద్ నుంచి కాచిగూడకు ఉండేది. ఆ రైలును తిరిగి పున ప్రారంభించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావును తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం చేగుంటలో కలిసి వినతి పత్రం అందజేశారు. 07593 రైలు తిరిగి ప్రారంభించి నిజామాబాదు నుండి 2 గంటల 30 నిమిషాలకు బయలుదేరి కాచిగూడకు 6 గంటల 30 నిమిషాలకు చేరే విధంగా డెమో రైలు వచ్చినట్లయితే వడియారం రైల్వే స్టేషన్లో ఎక్కే ప్రయాణికులు, ఉద్యోగులకు , వ్యాపారవేత్తలకు, విద్యార్థులకు, రైతు లను ఉపయోగకరంగా ఉంటుందని, మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవ లేని రఘునందన్ రావుకు ఉపాధ్యాయ బృందం తెలియజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు, త్వరలోనే సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపినట్లు తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటస్వామి, నాగవేందర్ రావు పాల్గొన్నారు.

శివరైస్ మిల్‌కు ప్రహరి గోడ నిర్మించాలి



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో గల శివ రైస్ మిల్‌కు ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్తులు వాపోతున్నారు. శివ రైస్ మిల్లు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నందున ప్రహరి గోడ నిర్మించకపోవడంతో వచ్చి పోయే వాహనదారులకు కళ్ళలో ఉనుక పొట్టు పడడంతో ఎన్నో ప్రమాదాలకు గురవుతున్నారు ఎన్నిసార్లు ఆర్డీవోలకు, తహసిల్దార్లకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో వడ్లపొట్టు ద్విచక్ర వాహనదారుల కళ్ళలో పడి యాక్సిడెంట్లు కూడా జరిగాయి. కలెక్టర్లకు, జాయింట్ కలెక్టర్లకు, ఆర్డీఓలకు, తహశీల్దార్లకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శివ రైస్ మిల్‌కు ప్రహరి గోడ నిర్మించేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే శివ రైస్ మిల్లుకు ప్రహరి గోడ నిర్మించాలి

కొమ్మాట సొమ్ము బాబు, నిజాంపేట నివాసి



మండల కేంద్రంలోగల శివ రైస్ మిల్లుకు ప్రహరి గోడ లేక మిల్లులోని వడ్ల పొట్టు రోడ్డుపై వెళ్లే వాహనదారుల కళ్ళలో పడి యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. గతంలో శివ రైస్ మిల్‌కు ఎదురుగా ఆటో, ద్విచక్ర వాహనదారులకు యాక్సిడెంట్‌లు జరిగినాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శివ రైస్ మిల్ కు ప్రహరీ గోడ నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

నిజాంపేటలో సంపూర్ణంగా భారత్ బంద్



నవతెలంగాణ-నిజాంపేట

జాతీయ మాల మహానాడు పిలుపుమేరకు భారత్ బంద్ కార్యక్రమం మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంపూర్ణంగా బంద్ చేయడం జరిగిందని మండల మాల మహానాడు అధ్యక్షుడు బండారి చంద్రయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు బంద్‌కు పిలుపునివ్వడంతో మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. బందుకు సహకరించిన ఉద్యోగ, వ్యాపారస్తులకు, ప్రజా సంఘాలకు, విద్యాసంస్థలకు పేరుపేరునా అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణను విరమించే వరకు పోరాడుతామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని వర్గీకరణను విరమించుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి సంజీవ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు టంకరి లక్ష్మణ్, బండారి మోహన్ ,గడ్డం కొండల్, టంకరి చంద్రం, బండారి ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడి పొందాలి



నవతెలంగాణ-టేక్మాల్

హైదరాబాద్‌లోని టీఐసిఏఆర్-ఐఐఎంఆర్, టేకామ్ల్ మండల ఎఫ్‌పిఓ వ్యవసాయ క్షేత్రాలలో డ్రోన్‌ల వినియోగం కోసం రైతు-శాస్త్రవేత్తల ఇంటరా క్షన్ ఫీల్డ్ డేని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసిఏఆర్-ఐఐఎంఆర్ డైరెక్టర్, డాక్టర్ సి.తారా సత్యవతి ప్రసంగిస్తూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, కూలీల ఖర్చులు, సమయాన్ని తగ్గించేందుకు వ్యవసాయంలో డ్రోన్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు. 750 మంది రైతులను సమీకరించి, రైతులకు నాణ్యమైన సేవలను అందించడంలో ఎఫ్‌పిఓ చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఐఐఎంఆర్‌కు చెందిన శాస్త్రవేత్తలు (డా. గంగయ్య డా. శ్రీనివాస్ బాబు, డా. సంగప్ప, డా. రాజేష, డా.స్వర్ణ), డా. రఫీ (తెలంగాణ ఎఫ్‌పిఓ అధికారి) టేక్మల్ మండలంలో 150 ఎకరాల్లో డ్రోన్‌ను విజయవంతంగా వినియోగించుకోవడం కోసం ఎఫ్‌పీఓ చేస్తున్న కృషిని అభినందించారు. టేక్మల్ ఎఫ్‌పిఓ చైర్మన్ మొగలయ్య, సీఈవో వెంకటేశం డైరెక్టర్లు బీరప్ప, దత్తు కృష్ణ రమేష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు టేక్మాల్ మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాంప్రసాద్ యూసుఫ్ సంగమేశ్వర్ గౌడ్, మొగల్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, లక్ష్మీనారాయణ, గ్రామ రైతులు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనుగు తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
గురువారం | 22 ఆగస్టు 2024 | www.navatelangana.com

నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

- చినుకు పడితే చిత్తడే
- రోడ్డు పై నాటు వేసి నిరసన



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం వెలికట్ట, ఆరేపల్లి మధ్య రోడ్డు వర్షం పడిందంటే చిత్తడిగా మారుతుంది. ప్రజలు కాలినడక నడవడానికి అనేక ఇబ్బందులు పడాల్సిందే. రోడ్డు పనులు చేపట్టి బాగు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మాజీ అధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు పై వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ జనగామ రోడ్డు నుంచి వెలికట్ట గ్రామం ఆరేపల్లి మీదుగా రాజీవ్ రహదారికి ఉన్నటువంటి రోడ్డును పట్టించుకునే వారే లేరన్నారు. నిత్యం కొండపాక సమీకృత కార్యాలయాలకు పలు గ్రామాల నుంచి రాకపోకలు జరుగుతాయన్నారు. వెలికట్ట డబుల్ బెడ్ రూమ్ ఆరేపల్లి గ్రామ ప్రజలు నిత్యం నిత్యవసర వస్తువులు కొరకు వెలికట్టకు రావాల్సి ఉంటుందన్నారు. వర్షం పడిందంటే టూ వీలర్స్ గాని ప్రజలు గాని నడవలేక ప్రమాదాలకు గురి అవుతున్నారని పేర్కొన్నాడు. అధికారులు, ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, పరుశరాములు, వంశీ,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'మేర మల్లేశం' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



తెలంగాణ సాయుధ పోరాట వీరుడు "మేర మల్లేశం" స్వీయ చరిత్రను కవి అన్నవరం దేవేందర్ రాసిన పుస్తకాన్ని బుధవారం హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో మేర మల్లేశం పోరాటం ఏనలేనిదని అన్నారు. నేటి యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ హౌజ్ ఫేడ్ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, హుస్నాబాద్ పట్టణ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందించిన ఆరోగ్య మిత్రలు

నవతెలంగాణ-సిద్దిపేట



వేతనాలు, ఇతర న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్యశ్రీలో భాగమైన ఆరోగ్య మిత్రలు అందరూ సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని ఆరోగ్య మిత్రలు కోటి, లక్ష్మి, రవీందర్ రెడ్డిలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీలో భాగంగా తాము సేవలు అందిస్తున్నామని అన్నారు. ఎన్నో ఏళ్లుగా కోరుతున్న తమ వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించిన సమస్యల పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ స్పందించకుంటే సమ్మె కైనా వెళ్తామన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు రాజు, వెంకట్ రెడ్డి, రాజయ్య, రజిత, రాజు, బాలు, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024-25 విద్యా ఏడాదికి గాను పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ప్రకటన వెలువడిందని చేర్యాలలోని పెద్దమ్మగడ్డ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ్మిషన్ పొందాలనుకునే అభ్యర్థులు నేరుగా సెప్టెంబర్ 10 వరకు ఆన్లైన్ విధానంలో ప్రవేశం పొందవచ్చని, ప్రవేశం పొందిన అభ్యాసకులు ఉచిత పాఠ్యపుస్తకాలు సెలవు రోజులలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరవుతూ సబ్జెక్టు ఉపాధ్యాయుల ద్వారా విషయ నైపుణ్యతను పెంచుకొని ఉద్యోగాల్లో పదోన్నతులు పొందవచ్చని అన్నారు. ఓపెన్ స్కూల్‌లో ఉత్తీర్ణత సాధించిన ఈ సర్టిఫికెట్ రెగ్యులర్ సర్టిఫికెట్ తో సమాన విలువను కలిగి ఉంటుందని, అభ్యాసకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.14 లేదా 15 సంవత్సరాలు నిండిన వారెవరైనా కొనసాగించడానికి ప్రవేశం పొందవచ్చని, యువతీ యువకులు సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల సమన్వయకర్త బండా నాగమణి, సహాయ సమన్వయకర్త సత్రం రాధిక తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునేవారు ఆధార్, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఇదివరకు చదివిన టిసి, కుల ధ్రువీకరణ పత్రాలతో బాలుర ఉన్నత పాఠశాలలో నేరుగా సంప్రదించాలని లేదా 955 055 8875 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షునిగా రాజు

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన బత్తుల రాజు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నియామక పత్రాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య చేత అందుకున్నారు. ఉపాధ్యక్షునిగా ముల్కల అరవింద్, ప్రధాన కార్యదర్శిగా అన్నాడి శ్రీనివాస్ రెడ్డిలు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బస్వరాజు శంకర్, హుస్నాబాద్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ- గజ్వేల్



కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా పనిచేస్తుందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతు రుణమాఫీ చేయడం హర్షనీయం గొప్ప నిర్ణయం అన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి మేలు చేయలేదని కేవలం మాటలకే పరిమితమైంది అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా నెరవేరుస్తూ ప్రజాదారణ పొందుతూ పరిపాలన కొనసాగిస్తున్నారు. ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ కూడా చేయడంతో రైతుల్లో ఎంతో సంతోషం నెలకొన్నది అన్నారు. దీన్ని ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

నేటి నుంచి ప్రజా పాలన సైటు అందుబాటులో ఉంటుంది

నవతెలంగాణ-గజ్వేల్



నేటి నుంచి ప్రజాపాలన సైట్ ను అందుబాటులోకి వచ్చిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు ముందు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజా పాలన వెబ్సైటు అందుబాటులో లేకపోయిందన్నారు. తిరిగి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన లోని గృహ జ్యోతి, రెండు వందల యూనిట్లు లోపు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్లైన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులకు చెందిన ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కలిగిందన్నారు. దీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెజగమ స్కూల్ కి మైక్ సెట్ అందజేత

- తలకొక్కుల చంద్రకళ చారిటబుల్ ట్రస్ట్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

దాతలు ముందుకు వచ్చి స్కూల్‌కి అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ టీ.లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఆయన 78వ జన్మదినోత్సవ సందర్భంగా గజ్వేల్ మండల్ బెజుగామ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన చేతుల మీదుగా మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో కేకు కట్ చేయడం సంతోషపరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు. స్కూలుకు సంబంధించి ఏ సమస్య ఉన్న పరిష్కరించగలరు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహ రెడ్డి, రమేష్, రామ్ రెడ్డి, ట్రస్ట్ క్యాషియర్ దుర్గాప్రసాద్, కార్యదర్శి మధుసూదన్, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసం మైనంపల్లి పాకులాడుతున్నాడు

- మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు బాలరాజు



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాజకీయ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాకులాడుతున్నాడని మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేటలో హరీశ్ రావు పై గూండాలతో బల ప్రయోగం చేయాలనుకోవడం మైనపల్లి హనుమంతరావు అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోనే సిద్దిపేట నియోజకవర్గాన్ని హరీశ్ రావు చేసిన అభివృద్ధి ఎక్కడ జరగలేదని గుర్తు చేశారు. హరీశ్ రావు పై విష ప్రచారం చేయడంతో పాటు రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం మైనంపల్లి హనుమంతరావు సిద్దిపేటలో చేసిన హంగామానే నిదర్శనం అన్నారు. ఏదో ఒక కారణంతో సిద్దిపేటకు మైనంపల్లి రావడం హరీశ్‌రావు పై విమర్శలు చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి నాయకులకు త్వరలోనే సిద్దిపేట ప్రజలు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బెల్ట్ షాపులను మూసివేయాలి

- బెల్ట్ షాపుల నియంత్రణకు ప్రత్యక్ష పోరాటం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-గజ్వేల్

ప్రజలకు ప్రాణ సంకటనగా మారి, కుటుంబాలను అప్పుల పాలు చేస్తున్న బెల్ట్ షాపులను తొలగించాలని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామం, పట్టణము, గుడి, బడి తేడా లేకుండా ప్రతి గ్రామంలో 4 నుంచి 10 బెల్ట్ షాపులు పట్టణాల్లో పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు నడుస్తున్నాయని వెంటనే తొలగించాలని లేనిచో మహిళా సంఘాలు, డ్వాక్రా సంఘాలతో కలిపి ప్రత్యక్ష కార్యచరణ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. విచ్చలవిడిగా బెల్ట్ షాపులో ఉండడం ఫలితంగా ఉదయం 5 గంటల నుంచి మద్యం అమ్మడంతో యువకులు, కుటుంబ పెద్దలు మద్యం వ్యసనానికి బానిసలు అవుతున్నారు. కుటుంబాలు అప్పుల పాలు కావడం జరుగుతుంది మందు తాగిన వ్యక్తులు శరీరంలోని అనేక భాగాలు పాడై పోవడంతో వైద్యానికి రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. చిన్నతనంలోనే మహిళలు తమ భర్తలను కోల్పోతున్న పరిస్థితి ఉంది. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. మద్యం నియంత్రణ అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తూ వదిలిపెట్టడం జరుగుతుందని ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే బెల్ట్ షాపులు తొలగించాలని డిమాండ్ చేశారు. తొలగించని ఎడల ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వానికి గల్లా నింపుకోవడానికి మాత్రం శ్రద్ధ ఉందని ప్రజల ఆరోగ్యాలు, కుటుంబాల ఆర్థికంగా దెబ్బతిని రోడ్డు పాలవుతున్నారని గమనించడం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో అనేక కుటుంబాలు మద్యం మత్తులో పడి విచ్ఛిన్నమవుతుందని ఆవేదన చెందారు. ప్రభుత్వం కేవలం సంపాదన చూసుకోకుండా కుటుంబాల పరిస్థితులు కూడా దృష్టి పెట్టాలని గ్రామీణ ప్రాంతంలో ఉన్న బెల్టు షాపులను పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు.

గెస్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

- గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. దేవయ్య



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ జాతీయ నాయకులు, ఎంపీ రాహుల్ గాంధీ తన జోడయాత్రలో ఇంటర్మీడియట్ గెస్ట్ లెక్చరర్‌ను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని, సీఎం రేవంత్ రెడ్డి తమపై దయ తలిచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1654 మంది గెస్ట్ లెక్చరర్‌లను రెగ్యులర్ చేయాలని గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.దేవయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం సిద్దిపేటకు వచ్చిన మైనంపల్లి హనుమంతరావును కలిసి గెస్ట్ లెక్చర్ సమస్యల పైన వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 402 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 6000 మంది టీచింగ్ స్టాఫ్ ఉన్నారని, దానిలో 1000 మంది రెగ్యులర్ లెక్చరర్స్ కాగా, 3200 మంది కాంట్రాక్టర్ లెక్చరర్స్ ని, వారిని గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని, కానీ చివరగా అభద్రతతో మిగిలిన 1654 మంది గెస్ట్ లెక్చరర్స్‌ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున్, లేడీ జనరల్ సెక్రెటరీ రేణుక, సభ్యుడు అశోక్, బాల్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం పచ్చదనమే లక్ష్యం.....!

- 16 శాఖలకు 21,62,700 మొక్కలు నాటడమే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 88 శాతం పనులు పూర్తి
- ఐదు మున్సిపాల్టీల్లో 90వేల మొక్కలు నాటిన అధికారులు
- 142 హెక్టర్లలో లక్ష్యానికి చేరుకున్న అటవీ శాఖ
- జిల్లాలో కొత్తగా అందుబాటులోకి నగర ప్రకృతి ఉద్యానవనాలు







నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

చెట్లే సమస్త మానవాళికి ప్రాణవాయువు. ఈ ఏడాది వర్షాకాలంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం అన్నిరకాల కసరత్తు చేసింది. గత ప్రభుత్వం హరితహారం పేరిట మొదలు పెట్టిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం (స్వచ్ఛదనం - పచ్చదనం) పేరున బృహత్తర కార్యక్రమానికి ఆగస్టు నెలలో శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లా యంత్రంగానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఈ పథకాన్ని పకడ్బందిగా అమలు కోసం అధికారులు పని చేస్తున్నారు. జిల్లాల్లో ప్రతి ఏటా అటవీ అధికారులు చెట్ల పెంపకం, మొక్కలు నాటడానికి అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేసి స్వచ్ఛదనం పెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంపై జిల్లా అటవీ శాఖ అధికారి కె. శ్రీనివాస్ ప్రత్యేక ముఖాముఖి నవతెలంగాణతో మాట్లాడారు.

నవతెలంగాణ: 2024 -25 ఏడాదికి గాను జిల్లా వ్యాప్తంగా ఎన్ని లక్షల మొక్కలు నాటారు. మీ లక్ష్యం ఎన్ని లక్షల మొక్కలు ...?

అధికారి: 21,62.లక్షల మొక్కలు నాటడం లక్ష్యం, ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి

నవతెలంగాణ: జిల్లా గ్రామీణఅభివృద్ధి శాఖా ద్వార ఎక్కడెక్కడ మొక్కలు నాటారు..?

అధికారి:జిల్లాల్లోని గ్రామా పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలు, ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు రైతుల వ్యవసాయ భూముల్లో మొక్కలు విరివిరిగా నాటడం జరిగింది

నవతెలంగాణ: ఐదు మున్సిపాల్టీల్లోఎక్కడెక్కడ మొక్కలు నాటారు..? బహుశ అవి ఎన్ని వేల మొక్కలుంటాయి..?

అధికారి: సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల కలిపి ఐదు మున్సిపాలిటీలలో 90 వేల మొక్కలు ఉంటాయి. పాఠశాలల,కళాశాల ప్రాంగణంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ఈ పనులు పూర్తీ చేశాం.

నవతెలంగాణ: అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందజేసిన మొక్కలను ఎన్ని వేల హెక్టర్లలో నాటి, మీ లక్ష్యాన్ని చేరుకున్నారు..?

అధికారి: జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో 142 హెక్టర్లలో 45 వేల మొక్కలు నాటి మా శాఖకి ప్రభుత్వం కేటాయించిన లక్ష్యానికి చేరుకున్నాం.

నవతెలంగాణ: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ఎవరెవరూ భాగస్వామ్యులు అయ్యారు..?

అధికారి: జిల్లాలో ఈనెల 9 వరకు చేపట్టిన కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛదనం - పచ్చదనం భాగస్వామ్యులై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నవతెలంగాణ: జిల్లాలో కొత్తగా నగర ప్రకృతి ఉద్యానవనలు ఎన్ని అందుబాటులోకి వచ్చాయి..? అవి ఎవేవి..?

అధికారి: జిల్లాలో కొత్తగా మూడు నగర ప్రకృతి ఉద్యానవనలు అందుబాటులోకి తెచ్చాం. అందులో 1. సంగాపూర్, 2.మర్పడగ, 3.చింతమడక రిజర్వ్ ఫారెస్ట్

నవతెలంగాణ: జిల్లాలో తేజోవనం అనే నగర ప్రకృతి ఉద్యానవనం ఎక్కడ ఉంది..? అభివృద్ధి కార్యక్రమం జరుగుతుందా ..?

అధికారి: సిద్దిపేట జిల్లాకు కూత వేటు దూరంలో ఉన్న కొత్త కలెక్టరేట్‌లో138 హెక్టర్లలో(340 ఎకరాల్లో) భూమి సాగు చేసి తేజోవనం ఏర్పాటు చేసి అభివృద్ధిలోకి తీసుకువచ్చాం.

నవతెలంగాణ: కల్పవనం పేరుతో నగర ప్రకృతి ఉద్యానవనం ఎక్కడ ఉంది..? ఎన్ని వేల ఎకరాల్లో ఈ వనాన్ని ఏర్పాటు చేశారు..?

అధికారి: గజ్వేల్ మండలంలోని సంగాపూర్‌లో కల్పవనమే ఉద్యానవనం ఉంది. 117 హెక్టర్లలో(289 ఎకరాల్లో)ఈ వనం ఏర్పాటు చేశాం.

నవతెలంగాణ: జిల్లాలో నర్సరీల ద్వారా ఎన్ని లక్షల మొక్కలు పెంచారు..?

అధికారి: దాదాపు 37.65 లక్షల మొక్కలు పెంచాం.

నవతెలంగాణ: సిదిపేట-ఎల్కతుర్తి 765 డీజీ జాతీయ రహదారిపై ఎన్ని వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు..?

అధికారి: నూతనంగా ఏర్పాటు చేస్తున్న సిదిపేట-ఎల్కతుర్తి (జాతీయ రహదారి) వరకు 46 కిలోమీటర్ల మేర 38 వేల మొక్కలు నాటే కార్యక్రమం. కానీ రహదారి పనులు జరుగుతుండగా ఆలస్యం కానుంది. పనులు పూర్తి కాగానే అటవీశాఖ ఆధ్వర్యంలోనే మొక్కలు నాటుతాం. బహుశ వర్షాకాలంలోనే ఈ పని పూర్తీ చేస్తాం.

నవతెలంగాణ: జిల్లా యంత్రాంగంలో పని చేసే 16 శాఖలు టార్గెట్‌గా నాటాల్సిన మొక్కలు ఎన్ని, ఇప్పటివరకు ఎన్ని లక్షలు మొక్కలు నాటారు..?

అధికారి: జిల్లా వ్యాప్తంగా 21,62,700 మొక్కలు నాటడం టార్గెట్ కానీ ఇప్పటివరకు 17,76, 813 మొక్కలు విరివిరిగా నాటి 88.28 శాతం పనులు పూర్తీ చేశాం అలాగే పలుశాఖాల ద్వార 13,2461 మొక్కలు పంపిణీ చేశాం.

మార్కెట్ కమిటీ పాలకవర్గాలకు మోక్షం లేదా?

- అధికారం చేపట్టి తొమ్మిది నెలలకు వస్తున్న కాంగ్రెస్





నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ చేసేందుకు స్థానిక నాయకత్వం ఇంకా దృష్టి పెట్టడం లేదు. గజ్వేల్ నియోజకవర్గంలో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, రెండు ప్రభుత్వ దేవాలయాల కమిటీలు ఉన్నాయి. అంతేకాకుండా ఆత్మ కమిటీలకు పాలకవర్గాలను నియమించాలి. మొదట్లో తర్జనభజనపడ్డ డీసీసీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ప్రస్తుతం పాలకు వర్గాలను నియామక పై దృష్టి పెట్టడం లేదు. రాష్ట్ర స్థాయిలో యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ పదవికి నర్సారెడ్డి కూతురు అంక్షారెడ్డి పోటీలో ఉన్నారని అందుకే దీనిపై దృష్టికి పెట్టడం లేదని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో పదవులు పంపకంపై కొందరు అసంతృప్తిగా ఉండటంతో ముందు సాగడం లేదని మరికొందరు నాయకులు చెప్పుకొస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచించిన విధంగా డీసీసీ అధ్యక్షులకు నియామక బాధ్యత ఉందని గతంలోనే ప్రకటించారు. పార్టీలో అసంతృప్తులను నివారించి ఈ చర్యలు తీసుకోవాలని సీఎం, ఇతర మంత్రులు సూచించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని వంటిమామిడి మార్కెట్ కమిటీ ఎస్సీ మహిళకు కేటాయించగా గజ్వేల్, కొండపాక, జనరల్ గా కేటాయించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవులకు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు అంతా పోటీ పడుతున్న నేపథ్యంలో పదవులు ఆగుతున్నట్లు స్థానిక నాయకులు చర్చించుకోవడం కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తుంది అయినా నామినేటెడ్ పనులపై దృష్టి పెట్టకపోవడం స్థానిక నాయకులు కార్యకర్తలు కొంత అసంతృప్తిగా ఉన్నారు. చాలామంది నాయకులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు.

గజ్వేల్ కాంగ్రెస్ లో బుజ్జగింపులు

గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్న నాయకులను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తో పాటు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బుజ్జగించినట్లు తెలిసింది. పార్టీలో పదవులు ఆశిస్తున్న నాయకులతో నెల రోజుల క్రితం అల్వాలలో ముఖ్యమైన నేతలతో డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు భేటీ కాగా దీనిపై చర్చించారు. ఆషాడ మాసం దాటిన తర్వాత భర్తీ చేస్తామని చర్చించినప్పటికీ ఆషాడ మాసం దాటి వారం గడుస్తున్నా దీనిపై ఇంకా దృష్టి పెట్టలేదని స్థానిక నాయకులు భావిస్తున్నారు.

హరీశ్ రావుకు మతి భ్రమించింది

- రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదు
- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, దేవులపల్లి యాదగిరి



నవతెలంగాణ-నంగునూరు

అధికారం కోల్పోయిన హరీశ్ రావుకు మతి భ్రమించిందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణా రాష్ట్ర రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు హరీశ్ రావుకు, బీఆర్ఎస్ నాయకులకు అసలే లేదని విమర్శించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతులో ఘోరంగా ఓటమి చెందిన పద్మా దేవేందర్ రెడ్డి ఓటమిని హరీశ్ రావు జీర్ణించుకోలేకపోతున్నాడన్నారు. మెదక్ అంటే హరీశ్ రావు అంత ప్రేమిందుకో అర్థం కావడం లేదన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి సిద్దిపేట అంటే అంత ఇంట్రెస్టింగ్ ఎందుకో అర్థం కావడం లేదన్నారు. సిద్దిపేట నియోజకవర్గనికి చెందిన దళిత నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ రెండు సార్లు కార్పొరేషన్ చైర్మెన్ పదవులు అనుభవించి నియోజకవర్గ దళితులకు ఓరగా పెట్టింది ఏంటో చెప్పాలని నిలదీశారు. తెలంగాణా ఉద్యమంలో ఆశ్రయం ఇచ్చి అన్నం పెట్టిన తోటి స్నేహితులకు ద్రోహం చేసిన ద్రోహి సిద్దిపేట గురించి ప్రజానాయకులు, అనునిత్యం ప్రజలకోసం పనిచేసే మైనంపల్లి హనుమంత రావు గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఎమ్మెల్సీ దేశ్ పతి శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రజా పాలన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులకు అందరికి భేషరతుగా ఒకేసారి రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ,ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని అనవసరంగా విమర్శిస్తే నాలుకలు చీరేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆవుల నాగరాజు,రాజన్నలు పాల్గొన్నారు.

రుణ మాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు

- నోడల్ అధికారులను నియమించాం
- గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్



నవతెలంగాణ-గజ్వేల్

అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు అని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు నాయక్ రైతులకు కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయం గజ్వేల్‌లో రైతులతో ముఖాముఖి గా మాట్లాడారు. ఇప్పటివరకూ రెండు లక్షల వరకూ రుణమాఫీ ప్రభుత్వం చేసినట్లు ఆయన చెప్పారు. మిగిత రైతులు అన్ని అర్హతలు ఉన్న రుణ మాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణ మాఫీ జరగలేదన్నారు. ఇందులో భాగంగా ఆధార్‌లోనీ పేరు, అకౌంట్ లోని పేరు తేడాగా ఉండటం ఒక కారణమన్నారు. బ్యాంకు అకౌంట్ చెల్లుబాటులో ఉండకపోవడం, పట్టా పాస్ బుక్కు నమోదు కాకపోవడం కావచ్చు అన్నారు. ఆధార్ నంబరు తప్పుగ నమోదు అవడం, కుటుంబ నిర్ధారణ కాకపోవడం అన్నారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, ప్రభుత్వ పెన్షన్దారు ఉండడం కావచ్చు అన్నారు. బ్యాంకు లోను అర్హత కటాఫ్ తేదీ లోపల ఉండకపోవడం, రేషన్ కార్డు లేకపోవడం, నిర్ధారణ లేకపోవడం కావచ్చు అన్నారు. మొదలగు సాంకేతిక కారణాల వల్ల రుణ మాఫీ రాకపోవచ్చు, అర్హత కలిగిన రైతుల అందరి నుంచి గ్రీవేన్స్ పిర్యాదులు మండల స్థాయిలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను, నోడల్ అధికారులు గా వ్యవసాయ శాఖ గుర్తించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే మండల నోడల్ అధికారులు. గజ్వేల్-నాగరాజు-7288894470, కోండపాక-శివరామకృష్ణ -8499912726, కుకునూర్ పల్లి-9948781551, రాయపోల్- ప్రద్యూమ్నా-441894649, ఈ కార్యక్రమంలో ఏఓ, ఏఈఓ లు, రైతులు గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు

రైతు రుణమాఫీలో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సవా లక్ష ఆంక్షలు పెట్టిందని, రైతు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలం అయిందని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉండటం లేదని కేవలం 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని ఇంకా 60 శాతం మంది రైతులు రుణమాఫీ కాలేదని అన్నారు. ప్రతిపక్షాలను రెచ్చగొట్టే మాటలు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం హోదాలో అన్ పార్లమెంటు పదాలు వాడుతున్నారని తెలిపారు. రుణమాఫీ కానీ రైతులందరూ రోడ్డుపైకి రావాలని పిలుపునిచ్చారు. రైతులకు పూర్తిగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. రైతు రుణమాఫీ సీఎం రేవంత్ రెడ్డికి ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. దఫాలుగా చేస్తున్న రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగటి దొంగల దొరికిపోయిందని అన్నారు. మిగతా 60 శాతం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

నేడు గజ్వేల్ పట్టణంలో భారీ రాస్తారోకో ధర్నా

రుణమాఫీ 60 శాతం కాలేదని నిరసిస్తూ గురువారం గజ్వేల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రైతులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

24న హెచ్‌సీఎల్ టెక్‌బీలో ఉద్యోగ మేళా

నవతెలంగాణ-సిద్దిపేట

ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపనీలో ఉద్యోగ మేళా ఈనెల 24న పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలలలో 2023-24 విద్యా ఏడాదిలో బైపీసీ, సీఈసీ, కంప్యూటర్ సైన్స్ (ఒకేషనల్)లో 75 శాతం ఉత్తీర్ణతతో ఇంటర్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పాస్ సర్టిఫికెట్, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ల జీరాక్స్, ఒక ఫోటో, మొబైల్ ఫోన్‌తో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు నెంబర్ 7569177071ను సంప్రదించాలని కోరారు.

టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా చంద్ర మోహన్

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట జిల్లా విద్యుత్ శాఖలో టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా టీఆర్ చంద్ర మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కేటగిరిలా సర్వీస్‌లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామని, ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వినియోగదారులకు సూచించారు.

రాష్ట్రానికే ఆదర్శం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో




- ఆక్యుపెన్సీ ఆదాయంలో స్టేట్‌లోనెంబర్ వన్ డిపో
- జీపీపీ డిపో మేనేజర్ పావన్

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ఆదాయం తేవడంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని డిపో మేనేజర్ పవన్ అన్నారు. బుధవారం ఆక్యుపెన్సీ పెంచి, రాష్ట్రంలో నెంబర్ వన్ డిపోగా నిలిచింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పవన్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా రూ.25.92 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆదాయం పెంచడంలో చరిత్ర సృష్టించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు డ్రైవర్లు, కండక్టర్లు, డిపో ఆర్టీసీ సిబ్బంది, కృషి ఫలితమే అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్రంలో అత్యధిక ఆదాయం సంపాదించింది ఏకైక డిపో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అని ప్రశంసించారన్నారు. ఇంతటి పేరు ప్రఖ్యాతులు వచ్చేందుకు శ్రమించిన అందరిని అభినందించామన్నారు. అనంతరం స్వీట్లు పంచుకొని, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబు నాయక్, ఎంఎఫ్ జమీల్, కంట్రోలర్స్, కండక్టర్స్, డ్రైవర్లు, మెకానికులు, భద్రత సిబ్బంది, డీఎం ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తండాకు రోడ్డు మంజూరు చేయాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-అక్కన్నపేట

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్ చెరువు తండా, దుబ్బతండా, తుక్క తండాలకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గిరిజన నాయకులు, పొన్నం ప్రభాకర్ వీరాభిమాని గుగులోతు రవీందర్ నాయక్ వినతి పత్రం బుధవారం వినతి పత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులను పిలిపించి సంబంధిత తండాలకు రోడ్డు వేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంత్రి స్పందించడం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కారం కాలేదని, మంత్రి పొన్నం ప్రభాకర్ సత్వరమే స్పందించడంతో వర్షం వ్యక్తం చేశారు.

ప్రజల రక్షణ లక్ష్యంగా విధులు నిర్వహించాలి

- డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలి
- సీపీ డాక్టర్ బి. అనురాధ



నవతెలంగాణ సిద్దిపేట అర్బన్

ప్రజల రక్షణ లక్ష్యంగా విధులు నిర్వహించాలని, డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను తెలుసుకోవాలని సీపీ డాక్టర్ బి. అనురాధ అన్నారు. బుధవారం సీపీ ఆఫీస్‌లో జిల్లాలో ఉన్న బ్లూ కోల్ట్స్ సిబ్బందికి నూతన టాబ్స్ ఆమె అందజేసారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోజూ ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని అన్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ మల్లేశం గౌడ్, ఐటీ కోర్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, బ్లూ కోర్ట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి

- జిల్లా మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ కార్యాలయ కోఆర్డినేటర్ లావణ్య



నవతెలంగాణ -దుబ్బాక

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని అందుకు అవసరమైన ప్రోత్సాహకాల్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ కో-ఆర్డినేటర్ లావణ్య తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులకు బ్యాంకులు, శ్రీనిధి ద్వారా రుణాలు ఇప్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. దుబ్బాక పురపాలిక కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (డీఆర్ డీఏ) కార్యాలయంలో ఏపీఎం డీ.నర్సింలు అధ్యక్షతన బుధవారం జరిగిన 'దుబ్బాక మండల మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘాల ఫెడరేషన్ లిమిటెడ్' 15 వార్షిక మహాసభ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా శక్తిలో భాగంగా మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు గాను వీరికి అమ్మ క్యాంటీన్స్‌లు,మిల్క్ ఏనిమల్, పెరటి కోళ్ల పెంపకం, మిల్క్ పార్లర్, ఫిష్ లేఅవుట్ వంటి పలు యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి సూచనలు సలహాలు అందించడం జరిగింది. ఇందుకోసం ఆసక్తి కలిగి ఉన్న, అర్హులైన మహిళలకు బ్యాంకులు, శ్రీనిధి ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు వీవోఏ (ఏ.పద్మ, కే.సంధ్య, గౌతమి, అరుణ, లింగవ్వ)లను గుర్తించామన్నారు. వీరిని ఏపీఎం నర్సింలు ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు స్వాతి, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్ళు, కార్యదర్శులు, కోశాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు



నవతెలంగాణ-జగదేవపూర్

రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 లోపు రుణం పొందిన రైతు రుణమాఫీకి అర్హులని అలాంటి వారందరికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. అయితే పలు కారణాలతో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని దీనికోసం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో మంగళవారం నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హత ఉండి రుణమాఫీ కానీ బ్యాంకు నుంచి రుణం పొందిన స్టేట్మెంట్, ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, రేషన్ కార్డ్ (ఉన్నచో) జిరాక్స్ ప్రతులతో వచ్చి ఈ రుణమాఫీ ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని కోరారు.


చదువుకున్న పాఠశాలకు కృతనిశ్చయంతో సహకారం



నవతెలంగాణ-రాయపోల్

చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా కృత నిశ్చ యంతో సంకల్పంతో తన వంతు సహకారం అందించాలని టీవీ, బోధనోపకరణాలు అందివ్వడం జరిగిందని మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల ప్రధానోపాధ్యారాలు స్వప్న అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థి చిందం రమేష్ టీవీ, బోధనలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాల 1994-95 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి చిందం రమేష్ 30 ఏళ్ల క్రితం 8 వ తరగతి నుంచి 10 తరగతి వరకు 3 ఏళ్లు విద్యను అభ్యసించినప్పటికీ ఈ పాఠశాలను మర్చిపోకుండా తాను చదువుకున్న పాఠశాలకు సహకారం అందించాలని కృతనిశ్చయంతో సంకల్పంతో టీవీ, బోధనోపకరణాలు రూ. 75 వేల విలువ కలిగిన వస్తువులను అందజేశామన్నారు. రమేష్ ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో కేరళ గ్రామీణ బ్యాంకులో జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నారని, చదువుకున్న పాఠశాల పై మమకారంతో ఈ సహకారం అందించినందుకు గురుకుల పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం చిందం రమేష్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి నాకు విద్యాబుద్ధం నేర్పిన ఎంజేపీ పాఠశాలనే కారణమని అలాంటి పాఠశాలకు ఎంత సహకారం అందించిన తక్కువే అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కెనరా బ్యాంక్ మేనేజర్ సందీప్, ఏటీపీ శ్యామల, సూపర్డెంట్ గాంధారి నరేందర్ రెడ్డి, డిప్యూటీ వార్డెన్లు నాగేశ్వర్, మురళి, పూర్వ విద్యార్థులు రాజేశం, లైన్మెన్ రవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిగా సాయికిరణ్ బాధ్యతలు




నవతెలంగాణ- రాయపోల్

ప్రభుత్వ సాధారణ ఉద్యోగుల బదిలీలో భాగంగా దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గోవిందరాజులు సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన సాయికిరణ్ బదిలీపై సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలానికి వచ్చారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్నివేళల్లో అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తానని తెలిపారు. రుణమాఫీ పై ఎలాంటి సందేహాలు ఉన్న సంప్రదించవచ్చని ఇప్పటివరకు రుణమాఫీ జరిగిన రైతులు వారి ధ్రువపత్రాలతో రైతు వేదికలలో సంప్రదించాలన్నారు. రైతులకు ఎరువులు విత్తనాలు సకాలంలో అందేటట్లుగా పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

5వ వార్డులో ఉచిత కంటి వైద్య పరీక్షలు

- 5వ వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట 5వ వార్డులో ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చినట్టు 5వ వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ తెలిపా రు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్యులు ప్రజలకు వివిధ కంటి చికిత్సలను చేయించినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయబడునని తెలిపారు. వైద్య శిబిరం విజయవంతమైనందుకు సంతోషంగా ఉందన్నారు.

అయ్యో పాపం విద్యార్థులు

- చేపల మడుగును తలపిస్తున్న బాలికల స్కూల్
- ప్రజ్ఞాపూర్ బాలికల స్కూల్‌లో భారీగా చేరిన వరద నీరు
- పట్టించుకోని అధికారులు, ఉపాధ్యాయులు
- ప్రజ్ఞాపూర్ యువతతో కదిలిన యంత్రాంగం
- తూతూ మంత్రంగా వరద నీరు తొలగింపు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఇటీవల కురిసిన వర్షానికి ప్రజ్ఞాపూర్ గర్ల్స్ హై స్కూల్ పూర్తిగా వరద నీటితో జలమయంగా మారింది. గత రెండు రోజులుగా పాఠశాలలోకి వెళ్దామన్నా పోనివ్వకుండా బురదమయం అయింది. విద్యార్థులు చిన్నచిన్న రాళ్ళు, ఇటుకలు వంతెన పేర్చి ఒకరి తరువాత ఒకరు వాటి పైనుంచి దాటుకుంటూ స్కూల్లోకి వెళుతున్నారు. అధికారులు, ఉపాధ్యాయులు చేసేదేమీ లేక చోద్యం చూస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయాలంటే ఆ నీటిలో నిలబడి తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంట చేసే కిచెన్ వద్దకు సైతం వర్షపు నీరు చేరింది. అక్కడ గది చుట్టూ పరిసరాల్లో చిన్నపాటి చెరువును తలపించింది. అష్ట కష్టాలు పడి వంట వండి పక్కనే ఉన్న వరండ పైకి భోజనం, కూరగాయలు, తీసుకురావాలంటే వంట మనిషికి తల ప్రాణాలు తోకకు వచ్చాయి. అన్నమో రామచంద్ర ఏం చేసేది అంటూ తలబాదుకున్నారు.

చెరువులో చేపల్లా విద్యార్థులు

పూర్తిగా పాఠశాల ఆవరణం నీటితో బురద మయంగా మారడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడ ఒకరు, ఇక్కడ ఒకరు, అన్నట్లుగా వచ్చి భోజనాన్ని స్వీకరించారు. వరదనీరు కళ్ళు దుట్టే ఉండటంతో భోజనం చేయాలన్న చేయబుద్ధి కావడం లేదని కొంతమంది విద్యార్థులు చెప్పకనే చెప్పారు. నీరు ఎక్కడ లేదో అక్కడికి వెళ్లి భోజనం చేశారు. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో ఎవరు చేస్తారో అన్నట్లుగా విద్యార్థులు ఎదురు చూశారు. నువ్వు అక్కడ నేను ఇక్కడ అన్నట్లుగా ఎక్కడ నీరు లేదో అక్కడక్కడ విద్యార్థులు కనిపించారు.

ఇంత సమస్య ఉన్న అధికారుల దృష్టికి పోలే

స్కూల్ ఆవరణ మొత్తం బురదమయంగా మారడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పై అధికారుల దృష్టికి వెళ్లలేదు. ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎక్కడ గుంత ఉన్న, నీరు నిలువ ఉన్న వెంటనే మట్టి, మొరంతో లెవెల్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈలాంటి




పరిస్థితుల్లో పాఠశాల ఉపాధ్యాయులు చొరవ తీసుకోకపోవడం సమంజసం కాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. అటుగా వచ్చిన తల్లిదండ్రులు గర్ల్స్ హై స్కూల్ పరిస్థితిని వాట్సాప్ లోకి ఎక్కించారు. దాంతో ఈ సమస్య జనాలకి తెలిసింది.

ప్రజ్ఞాపూర్ యువత చందాలు వేసుకున్నారు

ప్రజ్ఞాపూర్ సమస్యలకు నిలయంగా మారిందని ఏ సమస్య ఉన్న పరిష్కరించే నాథుడే కరువాయాడని ప్రజ్ఞాపూర్ యువత ముందుకు వచ్చింది. ప్రజ్ఞాపూర్‌లో గర్ల్స్ హై స్కూల్ పూర్తిగా పిచ్చి మొక్కలు, వర్షపు నీటితో ఆవరణ నిండిపోయిందని వాట్సాప్ ద్వారా తెలుసుకున్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకండి అని అన్నారు. యువత వాట్సప్‌ల్లో స్కూల్లో పిచ్చి మొక్కలు వర్షపునీరు తీసివేసేందుకు నడుం బిగించారు. ఎవరికి తోచినంత వారు ఆర్థిక సహాయం చేస్తే నేను వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారని ఎవరికి వారు ముందుకు వచ్చారు. ప్రజ్ఞాపూర్ కు చెందిన పలువురు రూ .500, రూ. 200 జమ చేసుకున్నారు. పిల్లలకి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే తక్షణమే స్కూల్ ఆవరణ మొత్తం శుభ్రం చేయాలని అనుకున్నారు. ఎంత ఖర్చైనా విద్యార్థుల కోసం పెట్టేందుకు వెనకాడ మని ప్రజ్ఞాపూర్ యువత తెలిపారు.

తూతూ మంత్రంగా చర్యలు.

ప్రజ్ఞాపూర్ గర్ల్స్ స్కూల్లో గ్రామ యువత డబ్బులు పోగు చేస్తున్నారని వాట్సాప్ ద్వారా పలువురు నాయకులు తెలుసుకున్నారు. మున్సిపల్ కార్మికులను పంపించి అక్కడ వర్షపు నీరు తొలగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. కానీ అక్కడ వర్షం నీరు అధికంగా ఉండడంతో తూతూ మంత్రంగా పారతో చిన్నపాటి కాలువలు చేసి వదిలేశారు. అక్కడే అడవిలాగా పెరిగిన పిచ్చి మొక్కలను సైతం కదపలేదు. మళ్లీ వర్షం కురిస్తే పాఠశాలలోకి విద్యార్థులు వెళ్లకుండా నీరు చేరుతుంది. పూర్తిగా నీరు తీసివేసి అక్కడ మొరం పోయిస్తే వర్షం నీరు నిల్వ కాకుండా సమస్య పరిష్కారం అవుతుందని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులు విద్యార్థులకు రాకుండా చూడాలి.

-బీఆర్ఎస్ మున్సిపల్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి క్యాసారం కృష్ణ.



ప్రస్తుతం ప్రజ్ఞాపూర్ గర్ల్స్ స్కూల్లో పూర్తిగా వర్షం నీరు నిల్వ ఉంది. దాంతో దోమలు వాటి పై స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయి. కాబట్టి ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉంది. స్కూల్‌లో గడ్డి, పిచ్చి మొక్కలు చాలా ఉన్నాయి. వాటిని వెంటనే తొలగించాలి. ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలి. లేదంటే విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ముప్పు ఉందని తల్లిదండ్రులు ఆవేదనను తనతో పంచుకున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి
- ఎస్పీ డాక్టర్ బి.అనురాధ





నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..

మాదక ద్రవ్యాల ప్రభావానికి జిల్లా ప్రజలు దూరంగా ఉండేలా పోలీస్, విద్యా, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, వ్యవసాయ, డ్రాగ్స్ నియంత్రణ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో వెంటనే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలని, అలాగే మాదకద్రవ్యాలు సరఫరా కాకుండా నిఘాపెట్టాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో కూడా వెంటనే యాంటీ డ్రగ్ కమిటీలను చేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలలో మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలపై చిన్నారులకు క్విజ్, ఉపన్యాసం, వ్యాస రచన పోటీలను నిర్వహించాలని అన్నారు. చిన్నారులు తినే చాకోలెట్లలో కూడా డ్రగ్స్ కలిపి పిల్లలు వాటినే తినేలా చేస్తున్నారని, పాఠశాలలకు వంద మీటర్ల దూరంలోపు చాక్లెట్లు అమ్మ షాపులను తొలిగించాలని అన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన కూలీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, మెడికల్ షాప్‌లో నిషేధిత డ్రాగ్స్ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని, పెయిన్ కిల్లర్స్ లలో నిషేధిత డ్రగ్స్ కల్పిఇచ్చే ఆర్ఎంపీలపై నిగా పెట్టాలని అన్నారు. మాదకద్రవ్యాల ప్రలోభాలకు గురైన వారికి కౌన్సిలింగ్, ట్రీట్మెంట్ ఇచ్చేందుకు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక సదుపాయం ఉందని దానిని ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. అదేవిదంగా వైద్య ఆరోగ్య శాఖ వారు ఫీవర్ సర్వే చేసినప్పుడు ఎవరైనా దగ్గు బానిసలు కనబడితే ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని డ్రగ్స్ అడిక్షన్ సెంటర్లో చేర్పించాలని అన్నారు. వ్యవసాయ అధికారులు, అటవీశాఖ అధికారులు గంజాయి సాగు జరగకుండా చూడాలని అన్నారు. వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదుల నైనా, సమాచారం నైనా 1908 కు అందించాలని సూచించారు.

ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ డా.అనురాధ మాట్లాడుతూ...

జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 28 గంజాయి కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. సిద్దిపేట వన్ టౌన్, గజ్వేల్, ములుగు , గౌరారం పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు అవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల ద్వారా రెండు, మూడు కిలోల స్థాయిలలో గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి లేబర్లకు ఇస్తున్నారని అన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో గంజాయి, మత్తు పదార్థాలు కలిపిన బిస్కెట్లు, నల్లబెల్లం అక్కడక్కడ కనిపిస్తున్నాయని అన్నారు. సిద్దిపేట పట్టణంలో ఒక ఆర్ఎంపీ డాక్టర్ పెయిన్ కిల్లర్‌లో మాదకద్రవ్యాలను మిక్స్ చేసి పేషెంట్లను మాదక ద్రవ్యాలకు బానిసలను చేస్తున్నట్లు అనుమానంగా ఉందని డ్రగ్స్ నిర్మూలనలో సంబంధిత శాఖల సపోర్ట్ అవసరమని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, సిద్దిపేట ఏసీపీ మధు, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి మహేష్, డ్రగ్ ఇన్స్పెక్టర్ వినయ సుష్మి, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపర్డెంట్ విజిత, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈత కోసం వెళ్లి చెరువులో మునిగి ఇద్దరు పిల్లలు మృతి

- శుభకార్యం కోసం వచ్చి...
- సరదా కోసం వెళ్లి మృత్యు ఒడిలోకి..



నవ తెలంగాణ-కొండపాక

కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామ చెరువులో ఈత కోసం వెళ్లిన ఇద్దరు విద్యార్థులు నీట మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. శుభకార్యం కోసం బంధువుల ఇంటికి వచ్చి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఆంజనేయులు అనే వ్యక్తి గురువారం గృహ ప్రవేశం ఉంది. అందుకోసం ఆయన బంధువులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గ్రామానికి చెందిన కుటుంబం బుధవారం వచ్చారు . ఇల్లేందుకు చెందిన మల్లేశం కుమారుడు బసవరాజ్ హేమంత్ (16)తో పాటు ఆయన స్నేహితుడు నికేష్ వర్ధన్ 13 గ్రామంలోని చెరువు సమీపంలోకి వెళ్లారు. దాంతో వారు చెరువులోకి వెళ్లి ఈత కొడుతున్న సమయంలో బురద నీటిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని సమీపంలో పశువులు మేపుతున్న వారు చూసి గ్రామంలోకి సమాచారం ఇవ్వగా గ్రామస్తులు చేరుకొని తీసే ప్రయత్నం చేశారు. సిద్దిపేట అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించడంతో పోలీసులు అగ్నిమాపక సిబ్బంది చెరువులో మునిగిపోయిన ఇద్దరు పిల్లలను గ్రామస్తుల సహకారంతో బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితునితో వచ్చి .....

బసవరాజ్ హేమంత్ , నికేష్ వర్ధన్ ఇద్దరూ మంచి స్నేహితులు బంధువుల గ్రామానికి వెళ్దామని మీతో నేను వస్తానని నిఖిలేష్ వర్ధన్ ఎప్పటికీ అంటూ ఉండేవారు. వరుస సెలవులు రావడం శుభకార్యం కలిసి రావడంతో మీ బంధువుల ఇంటికి నేను కూడా వస్తానని చెప్పి హేమంత్‌తో కలిసి నిఖిలేష్ వచ్చాడు. గ్రామంలో చెరువు సమీపానికి వెళ్లి నీటిని చూడగానే వాటిలో దిగి ఈత కొట్టాలని కోరిక పుట్టింది. చెరువులోకి దిగిన వారు మట్టిలో ఇరుక్కుపోయి పైకి రాక ఊపిరాడక చనిపోయారు.

శుభకార్యం ఇంట్లో విషాదం

శుభకార్యం కోసం వచ్చిన ఇద్దరు చెరువులో మునిగి మృతి చెందడంతో ఇంట్లో విషాదం నెలకొంది. పిల్లలను చూసి బంధువులు బోరుమని ఏడ్చారు.

గజ్వేల్లో నిలిచిపోయిన యూజీడీ పనులు



నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపాలిటీని మురుగు రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు గత ప్రభుత్వం తలపెట్టిన అంతర్గత మురుగు కాలువల నిర్మాణ పనుల కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. మునిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలపడం లో భాగంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం, గత ప్రభుత్వ పట్టింపులేని తనంతో మధ్యలోనే ఆగిపోయింది. 2021 చివరి నాటికి పూర్తి కావాల్సిన పనులు 2024 వచ్చినా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2018 ఆగస్టు 1న రూ.99కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. 100 కిలోమీటర్ల మేర పైప్లైన్ నిర్మాణం పూర్తికాగా, మరో 40 కిలోమీటర్ల మేర పైప్లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గతంలో విడుదల చేసిన రూ.99కోట్లు సరిపోక పోవడం, చేసిన పనులకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ చేసేదేమీ లేక మధ్యంతరాన పనులను వదిలేశారు. ఇప్పటివరకు కాలనీల్లో పూర్తిస్థాయి కనెక్షన్లు ఇవ్వకపోవడం. దీంతో రోడ్లన్నీ దుర్గంధంతో నిండిపోయాయి. మరోసారి వర్షాలు కురిస్తే ఇదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలున్నాయి. మున్సిపాలిటిలో వంద కిలోమీటర్ల మేర



యూజీడీ నిర్మాణం చేపట్టగా వంద కిలోమీ టర్లలో 9వేల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం 8,700 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు.

విలీన గ్రామాల్లో కానరాని యూజీడీ

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాలైన క్యాసారం, ముట్రాజ్పల్లి, సంగాపూర్ గ్రామాల్లో యూజీడీ అంశంపై మున్సిపల్ పాలకవర్గం రూ.40కోట్ల నిధులు కావాలని మున్సిపాలిటీలో తీర్మానం చేసి గత ప్రభుత్వానికి అంచనాను పంపించారు. దీంతో విలీన గ్రామాల్లో యూజీడీ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. ఇటు కాంట్రాక్టర్కు రావాల్సిన బిల్లులకు సంబంధించి ఎలాంటి స్పందన లేకపోవడంతో యూజీడీ నిర్మాణం, కొనసాగింపుపై గ్రహణం పట్టుకుందని చెప్పవచ్చు.

త్రాగు నీటి ఎద్దడి తీర్చిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

- కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించిన పాతూరు వెంకటస్వామి గౌడ్
- శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

గ్రామాల్లో నెలకొన్న త్రాగునీటి ఎద్దడి తీర్చేందుకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ అన్నారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్డీఎఫ్ నిధుల నుంచి 8 బోర్లు మంజూరు కాగా బుధవారం అక్బర్ పేట భూంపల్లి మండలంలోని బొప్పాపూర్, ఏనగుర్తి, చౌదర్పల్లి, భూంపల్లి, చిట్టాపూర్, చిన్న నిజంపేట, తాళ్లపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చడానికి కొబ్బరికాయలు కొట్టి పనులను వెంకటస్వామి గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ8 బోర్లలో నీళ్లు రావడం చాలా సంతోషకర విషయం అని తెలిపారు. గతంలో ఎంపీగా పనిచేసిన కొత్త ప్రభాకర్ రెడ్డి నేడు ఎమ్మెల్యేగా మారిండు, 2020 ఉపఎన్నికల్లో ఎమ్మెల్యేగా పనిచేసిన రఘునందన్ రావు ఎంపీగా మారిండు కానీ దుబ్బాక అభివృద్ధి మారలేదని ఎద్దేవా చేశారు. దుబ్బాక అభివృద్ధి దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డితో సాధ్యమైతుందని తెలిపారు. దుబ్బాక అభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి ప్రజల పక్షాన తాము కృతజ్ఞతలు తెలుపుతున్నమని అన్నారు. దుబ్బాక అభివృద్ధి కోసం కంకణ బద్దుడై పనిచేస్తున్న నాయకుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. రానున్న రోజుల్లో శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో దుబ్బాకను అభివృద్ధి పథంలో ముందు ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టెలికాం బోర్డు మెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు వేల్పుల యాదగిరి ముదిరాజ్, గోపరి రమేష్, గోపరి రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి



నవతెలంగాణ - సిద్ధిపేట

సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నందున ఆయా పాఠశాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి కి వినతిపత్రం అందించినట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. విజయేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే. తిరుపతిలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్య గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సిద్దిపేట, ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల సిద్దిపేటకు, కొన్ని ప్రాథమిక పాఠశాలలు సిద్దిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఇందిరా నగర్, పెద్దకోడూరు, హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నందున ఆయా పాఠశాలలకు వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేసి, విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి. తిరుపతిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పొనమల్ల రాములు, ఆర్. పద్మయ్య, జిల్లా నాయకులు ఎ.నర్సింహారెడ్డి, జి.శివాజీ, ఆర్.మల్లేశం తదితరులు పాల్గొన్నారు

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

- మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్



నవతెలంగాణ-మర్కుక్

నేరాల నియంత్రణకు, సత్వరంగా కేసులను చేదించుటలో సీసీ కెమెరాలు కీలకమని మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కర్కపట్ల గ్రామాన్ని ఆయన సందర్శించి, ప్రజలతో మాట్లాడుతూ అన్ని గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి గ్రామంలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగతనాలు నివారించే అవకాశం ఏర్పడుతుందన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించి యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా నేడు యువత భవిష్యత్తు ప్రమాదంలో వుందని, ఈ ప్రమాదం భారీన పడకుండా యువత అప్రమత్తంగా వుండాలన్నారు. ఎన్నో అశలతో మిమ్మల్ని ఉన్నత చదువులు చదివించి మీ బంగారు భవిష్యత్తుకై ఎదురుచూసే తల్లిదండ్రులకు తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారడంతో తల్లిదండ్రులు మనోవేదనకు గురౌవుతున్నరన్నారు. ప్రతి ఒక్కరు మీ తల్లిదండ్రుల గురించి ఒక్కసారి ఆలోచించాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల బారిన ఎవరు కూడా పడవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ హెల్ప్ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్ నడపవద్దని , ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే ఎవరన్నా అనుమా నాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ప్రజల ధన మాన ప్రాణ రక్షణకు డిపార్ట్మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం గ్రామస్తులు తదితరులున్నారు.

కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణకు తరలి వెళ్లాలి

- మాజీ సర్పంచ్ రావుల మొండయ్య
- విగ్రహావిష్కరణ కరపత్రాల ఆవిష్కరణ



నవతెలంగాణ-బెజ్జంకి

ఈ నెల 25న సిద్దిపేట జిల్లా కేంద్రంలో కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణకు మండలంలోని అయా గ్రామాల ముదిరాజ్ కులస్తులు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని చీలాపూర్ మాజీ సర్పంచ్ రావుల మొండయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయం అవరణం వద్ద కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహావిష్కరణ కరపత్రాలను రావుల మొండయ్య స్థానిక ముదిరాజ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కొరివి కృష్ణ జిల్లా సేవాసమితి నాయకులు బోనాల శ్రీనివాస్, బెజ్జంకి మండలం టౌన్ సంఘం అధ్యక్షులు రావుల కనకయ్య, కొరివి కృష్ణ స్వామి సేవ సమితి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొరివి తిరుపతి, బెజ్జంకి టౌన్ యూత్ అధ్యక్షుడు రావుల ప్రశాంత్,అట్ల శ్రీకాంత్, దేవన బోయిన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జేపీ తండా ప్రాథమిక పాఠశాలలో టై, బెల్టులు పంపిణీ

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం జేపీ తండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్లేట్లు, టై, బెల్టు, బ్యాడ్జిలను నంగునూరు మండల విద్యాశాఖాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సహకారాన్ని ఉపాధ్యాయులు శోభారాణి స్వంత డబ్బులను వెచ్చించి అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రం స్నేహితులు ప్లేట్లు పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ బిక్షపతి నాయక్ ప్రధానోపాధ్యాయులు చంద్రం, ఉపాధ్యాయురాలు శోభారాణి, మాజీ ఉప సర్పంచ్ పిట్టల ఆంజనేయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ లక్ష్మీ, పిల్లల తల్లిదండ్రులు, ఐకేపీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ శాఖ అధికారిగా భోగేశ్వర స్వామి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల వ్యవసాయ శాఖ అధికారిగా పి. భోగేశ్వర స్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు చేర్యాల వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహించిన ఎండీ. అఫ్రోజ్ దూలిమిట్ట మండలానికి బదిలీపై వెళ్లగా కోహెడలో విధులు నిర్వహించిన భోగేశ్వర స్వామి చేర్యాలకు బదిలీపై వచ్చారు.

ఘనంగా ఉపాధ్యాయురాలికి వీడ్కోలు

- విద్యావాలంటరీ నుంచి ఉపాధ్యాయురాలిగా

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



విద్యార్థిగా చేరి.. విద్యా వాలంటరీగా మారి... ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పాఠాలు చెప్పి, వేరే స్కూల్ కి ట్రాన్ఫర్ పై పద్మావతి టీచర్ వెళ్లారు. బుధవారం ఆమెకి విద్యార్థుల సమక్షంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండలం కొడకండ్ల స్కూల్ హెడ్మాస్టర్ మధునాల శ్రీనివాస్ మాట్లాడుతూ గజ్వేల్ మండల పరిధి కొడకండ్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో పూర్వపు ఉపాధ్యాయురాలు పద్మావతి కి వీడ్కోలుసమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పద్మావతి కొడకండ్ల గ్రామంలో 14 ఏళ్ల విధులు నిర్వహించారని పేర్కొన్నారు. మంచి క్రమశిక్షణ , విద్యాబుద్ధులు విద్యార్థులకు నేర్పించారన్నారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ కొడకండ్ల గ్రామంలో చదువుకొని, ఇక్కడే విద్యా వాలంటీర్ గా పనిచేశనన్నారు. మళ్లీ ఇదే గ్రామంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ విద్యార్థులకు పాటలు తోపాటు క్రమశిక్షణ స్నేహభావం లపై అవగాహన కల్పించమన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంలో ఇలాంటి స్వేచ్ఛ ఏ స్కూలుకి వెళ్లిన దక్కాలని ఆశాభావం వ్యక్తం చేశారు.విద్యార్థులందరికీ స్టీల్ ప్లేట్స్ ను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రహేలా, కల్పన, పద్మావతి, పాఠశాల వివో కళ్యాణి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పద్మ రమ, ఆయలు రాజేశ్వరి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-వర్గల్



మండలంలోని గౌరారం రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రోజున మధ్యాహ్నం జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గజ్వేల్ గ్రామానికి చెందిన చిక్కుడు కిరణ్ (30) గౌరారం వద్ద ఉన్నటువంటి సెవెన్ హిల్స్ హోటల్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వచ్చాడు. హోటల్ సమీపంలో ఉన్నటువంటి రోడ్డును కిరణ్ దాటుతుండగా ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్ళే గుర్తుతెలియని వేగంగా అజాగ్రత్తగా వస్తున్న వాహనం కిరణ్ ని ఢీ కొట్టడంతో తీవ్రగాయాలు కావడంతో కిరణ్ అక్కడిక్కడే మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులు నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా వాహనాన్ని గుర్తించే విధంగా దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహుకరించిన టీచర్

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గౌరవెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పదేళ్ల నుంచి పని చేసిన టువంటి ఉపాధ్యాయురాలు ఆనంద -సు సునీత బదిలీపై మల్లంపల్లి పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత తను పాటలు బోధించిన పాఠశాలకు 10,000 రూపాయల సౌండ్ సిస్టం బహుకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గగులోతు మల్లేశం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మర్కుక్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రెండు లక్షలు రుణమాఫీ పథకాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల ంలోని దామరకుంట గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ దామరకుంట గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన 9 నెలలలో అమలు చేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రుణమాఫీని విడుతల వారీగా ఇవ్వడంతో వడ్డీలకే సరిపోయిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ అమలు చేసిందన్నారు. రుణమాఫీ చేసిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు ఏం చేయాలో తెలియక ప్రభుత్వం పై విమర్శలు చేయడం అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ మండలాధ్యక్షులు వనం అంజనేయులు యాదవ్, నాయకులు కుమార్, శంకర్, బి.రాజు, గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్యాం ప్రసాద్ గౌడ్, గ్రామ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆనంద్ యాదవ్, గ్రామ సోషల్ మీడియా ఇంచార్జ్ కటికే విజయ్ కుమార్, తదితరులున్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవ తెలంగాణ - కొండపాక

కొండపాక గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కనకయ్య కు రూ.60 వేలు, ఎర్రబోయిన షామల రూ. 20.500, రమాదేవికి రూ.16 వేలు, గుమ్మడిదల కృష్ణకి రూ.13 వేల చెక్కులను మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో మంజూరు కాగా వాటిని పంపిణీ చేసినట్టు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంబటి బాలచంద్రం గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య , పార్టీ నాయకులు దొమ్మాట మహిపాల్ రెడ్డి, చెన్న రమేష్, ఎర్రబోయిన మల్లేశం, గిరి నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

నిజామాబాద్‌లో భద్రాచల ముత్యాల తలంబ్రాల పంపిణీ

నవతెలంగాణ-గజ్వేల్



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ 25 ఏళ్ల నుంచి చేస్తున్న అధ్యాత్మిక సేవలకు గాను భద్రాచల దేవస్థానం ఏ సంస్థకు ఇవ్వని 100కిలోల ముత్యాల తలంబ్రాలు రామకోటి సంస్థకు అందించినట్లు రామకోటి రామరాజు తెలిపారు. బుధవారం నిజామాబాద్‌లోని కోటగల్లి హనుమాన్ మందిరంలో ముత్యాల తలంబ్రాల పంపిణి చేశారు. 2గంటల పాటు భక్తులచే రామనామ స్మరణ చేయించి, తలంబ్రాల విశిష్టత తెలియజేసి అనంతరం సంస్థ వ్యవస్థాపక, అధ్యకులు అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచల సీతారాముల కళ్యాణానికి గోటితో ఒడ్లు ఓలిచి తలంబ్రాలుగా తయారుచేసి భద్రాచలం అందించిన ఘనత ఈ నిజామాబాద్ భక్తులది అని అన్నారు. అందుకే వారికి సాక్షాత్తు భద్రాచల తలంబ్రాలు అందించడం జరిగిందన్నారు. అంతరం భక్తులు మాట్లాడుతూ మేము భద్రాచలం పోలేక పోయిన కూడ మాకు భద్రాచల ముత్యాల తలంబ్రాలు అందడం అన్నో జన్మల పుణ్యఫలమో అన్నారు. రామకోటి రామరాజు చేతుల మీదుగా మాకు అందించడం అయన రామభక్తికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విష్ణు పంతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలు, నూతన చట్టాల పట్ల అవగాహన

నవతెలంగాణ- రాయపోల్



విద్యార్థులకు మహిళల రక్షణ చట్టలు, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించడం జరిగిందని రాయపోల్ ఎస్ఐ రఘుపతి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘుపతి మాట్లాడుతూ చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు ఎవరితోటైనా హింసకు ఎవరైనా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు కానీ స్నేహితులకు కానీ చెప్పుకోవాలని సూచించారు. లేనిపక్షంలో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. పిల్లలు, మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళ కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, ఇంద్రసేనారెడ్డి, మోహన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిలీట్ ఆప్షన్ అవకాశం ఇంటర్మీడియట్ బోర్డు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



ఇంటర్ విద్యార్థులకు స్వతహాగా డిలీట్ ఆప్షన్ అవకాశం ఇంటర్మీడియట్ బోర్డ్ కల్పించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ చేర్యాల పట్టణ కమిటీ సమావేశం బుధవారం పట్టణ కేంద్రంలో జరిగింది. సమావేశంలో ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు అడ్మిషన్ ప్రక్రియ మొదలయ్యి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ డిలీట్ ఆప్షన్ ఇవ్వకపోవడం సరైంది కాదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులను మభ్యపెట్టి ఇంటింటికి వెళ్లి సర్టిఫికెట్స్ తీసుకుంటున్నాయని ఆరోపించారు. ఇతర కళాశాలలో చేరుదామంటే ప్రయివేట్ కళాశాలలు అడ్మిషన్ డిలీట్ చేయడం లేదని, వేలకు వేలు డబ్బులు అడుగుతున్నారని దీనిపై డీఐఈఓ స్పందించడం లేదని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. కళాశాలలో అడ్మిషన్ తీసుకొని వేరే కళాశాలకు మారేందుకు టీసీ కావాలంటే అనేక రకాలుగా ఇబ్బందులు గురి చేస్తున్నారని, టీసీ కి రూ. 600 చొప్పున వసూలు చేస్తున్నారని, గ్రూపు మారడనికి రూ.700 కట్టాల్సిన పరిస్థితి నెలకొందని తక్షణమే ఇంటర్ బోర్డు మార్పులు తీసుకురావాలని కోరారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరు భరత్ కుమార్, పట్టణ నాయకులు శివ, వాసు, రవి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్ బంద్ విజయవంతం







నవతెలంగాణ-మద్దూరు

ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ జాతీయ మాల మహానాడు భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో మద్దూరు మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు బొప్ప నాగయ్య, ఆధ్వర్యంలో దుకాణ సముదాయాలను మూసి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. బీజేపీ పార్టీ మాలలపై కక్షపూరితతోనే సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చే విధంగా చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, శ్రీకాంత్, నీరటి కిషోర్, నీల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తలపెట్టిన భారత్ బంద్‌లో భాగంగా బుధవారం నంగునూరు మండల కేంద్రంలో విజయవంతమైంది. అదే విధంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు తరగతులను బహిష్కరింపజేశారు. ముందస్తుగా ప్రయివేట్ పాఠశాలలను మూసివేయించారు. బంద్‌కు సహకరించిన ప్రధాన వీధుల్లో హోటళ్ళు, దుకాణదారులు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజలు మద్దతు చూసైనా వర్గీకరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ సానాదుల బాలపోచయ్య, కో కన్వీనర్ అల్లిబిల్లి నర్సింగారావు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాముల వెంకటేశ్వర్లు, జాజాల కనకరాజు, సంఘం సభ్యులు పులి రవి, దాసరి కిషన్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ వర్గీకరణ వ్యతిరేక మిరుదొడ్డి మండల కమిటీ నాయకులు బంద్ నిర్వహించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ వర్గీకరణ పోరాట సమితి సభ్యులు దారస్వామి మాట్లాడుతూ, ఏబీసీడీ వర్గీకరణతో దళితుల మధ్య చిచ్చుపెట్టి కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందుతుందన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఏబీసీడీ వర్గీకరణ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని విద్యా సంస్థలతోపాటు వాణిజ్య, వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ సభ్యులు రాజేశం, స్వామి, మల్లయ్య, చంద్రం, అల్లిబిల్లి కుమార్, బాల మల్లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

ఎస్సీ, ఎస్టీ సంఘాలు బుధవారం భారత్ బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ బంద్ గజ్వేల్ నియోజకవర్గంలో విజయవంతంగా శాంతియుతంగా నిర్వహించడం జరిగింది. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్జీ మాయావతి ఉప వర్గీకరణ పై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునర్ సమీక్ష చేయాలని ఎస్సీ, ఎస్టీలలో క్రిమిలేయర్‌ను అమలు చేయవద్దని బీసీలలో క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని ఎస్సీ ఎస్టీల ఉప వర్గీకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారాలు కట్టబెట్టడం అన్యాయమని సుప్రీంకోర్టు తీర్పును పునర్ సమీక్ష చేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్ పద్ధతిని సవరించుకోవాలని మాల మహానాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనివాస్ అలాగే బీఎస్పీ జిల్లా నాయకులు కొండనోళ్ళ నరేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది అని అలాగే బీఎస్పీ గజ్వేల్ అధ్యక్షులు కానుగుల రమనకర్ మాట్లాడుతూ ఉభయసభలకు ప్రాధాన్యం లేదన్నట్లుగా తానే రాజ్యాంగ సవరణలకు ప్రతినిధిగా వ్యవహరించడం పూర్తిగా ఇది రాజ్యాంగ వ్యతిరేకం అన్నారు. నిరసనలో బీఎస్పీ నాయకులు జోడుముంతల నవీన్, రాము, కనక ప్రసాద్ మౌర్య, మల మహానాడు నాయకులు పి. స్వామి, ప్రభాకర్, రమేష్, జి స్వామి, నరేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రధాని మోడీ మనువాద వారసుడిలా ఈ దేశంలో దళితుల అనైఖ్యతకు ఆజ్యం పోశాడని మాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కో కన్వీనర్ వెన్న రాజు అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో భారత్ బంద్ విజయవంతం అయింది. కిరాణావర్తక, వాణిజ్య, వస్త్ర, వ్యాపార, స్కూల్స్, కాలేజీలు, హోటల్స్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ షాప్స్, ట్రేడర్స్, బేకరీ, చికెన్ సెంటర్స్, సిమెంట్ షాప్స్, జిరాక్స్ చిరు వ్యాపారులు అందరూ స్వచ్ఛందంగా బందుకు సంపూర్ణ మద్దతును ఇచ్చారు. ఎస్టీ సోదరులు పూర్తిస్థాయి మద్దతుగా బహుజన సమాజ్ వాదీ పార్టీ నేతలు బందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేఖ నిర్ణయం తీసుకునే అధికారం ఏ న్యాయవ్యవస్థకు లేదన్నారు. పార్లమెంట్ తీర్మానం లేకుండా ఆర్టికల్ 341 ను సవరించే అధికారం ఉండదన్నారు. అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచేలా వర్గీకరణ మద్దతు పార్టీలు వ్యవహరిస్తున్నాయన్నారు. బంద్ విజయవంతం చేసిన మాల సైనికులకు, బీఎస్పీ పార్టీ నేతలకు ఎస్టీ సోదరులకు, అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో , బొజు రవీందర్, బీఎస్పీ జిల్లా నాయకులు ద్యాగల వెంకటేశ్వర్లు, వేల్పుల రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంఘ బాధ్యులు గుగులోత్ రాజు నాయక్, యాస శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు వేల్పుల మహేష్ బాబు, పొడిచెట్టి అశోక్, సాయికుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేటలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సు డిపో ముందు బైఠాయించి బస్సులను బయటకు రానివ్వలేదు. పట్టణంలో తిరుగుతూ తెరిసి ఉన్న దుకాణాలను మూసివేయించారు. చాలామంది స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారు. ఎక్కడ కూడా అమాంజనేయ సంఘటన ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ జంజీరపు ఎల్లేష్, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు గ్యాదరి మల్లేష్, గ్యాదరి రాజారాం, గ్యాదరి జగన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త బందులో భాగంగా కొండపాక మండలంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. వెలికట్ట, కొండపాక, దుద్దెడ తదితర గ్రామాల్లోని విద్యా సంస్థలను వ్యాపార సంస్థలను మూసివేయించారు. ఈ కార్యక్రమంలో జంజరపు నర్సింలు, మహేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక మాల మహానాడు ఆధ్వర్యంలో భారత్ బందు విజయవంతంగా నిర్వహించారు. బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు నిరసిస్తూ మండలంలోని వెంకట్రావు పేట గ్రామంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, వివిధ షాపులు, పాఠశాలలు, రాంపూర్ జూనియర్ కళాశాల మూసివేసి రోడ్ పై రాస్తారోకో ఇర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాలలకు నష్టం కలిగించే వర్గీకరణ చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణకు వత్తాసు పలకడం, సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో మాకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ సపోర్టు చేసే ఆలోచనలో విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ కల్లెపు బాను చందర్, సభ్యులు వడ్డే కిష్టయ్య, కల్లెపు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో భారత్ బంద్ ప్రశాంతంగా కొనసాగించడం జరిగిందని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి బాధ్యులు బ్యాగరి స్వామి అన్నారు. బుధవారం రాయపోల్ మండల పరిధిలో భారత్ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ చేయడానికి సుప్రీంకోర్టుకు అధికారం లేదని పార్లమెంటరీ విధానంలో చట్టం చేసి రాష్ట్రపతి ఆమోదం తర్వాత సుప్రీంకోర్టు వర్గీకరణ చేసే అధికారం ఉంటుందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తామన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వ హక్కు, ఆర్టికల్ 341 షెడ్యూల్ కులాల ఐక్యమత్యానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పును భావించాల్సి వస్తుందన్నారు. దేశంలో ఐక్యంగా ఉన్న ఎస్సీలను వర్గీకరణ పేరుతో విడదీయడం కోసమే ఈ తీర్పు వర్తిస్తుందన్నారు. దేశంలో 85 శాతం జనాభా ఉన్న దళిత బహుజనలు ఏకమైతేనే రాజ్యాధికారం సాధిస్తామన్నారు. ఎస్సీ జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుందని ప్రతి రాష్ట్రంలో జనాభాలో వ్యత్యాసం ఉంటుందని రిజర్వేషన్ ఎలా అమలు చేస్తారన్నారు. గత 30 ఏళ్లుగా వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత బహుజన ప్రజాసంఘాలు పోరాటం చేస్తున్నాయని సుప్రీంకోర్టు తీర్పుపై పునసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు బాలకృష్ణ, పుట్ట నవీన్, కరుణాకర్, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు

మండల నాయకులు బొల్లం రాజేష్ ఆధ్వర్యంలో

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు అంటూ దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా భారత్ బంద్ విజయవంతం చేయడం జరిగిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల నాయకులు బొల్లం రాజేష్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలో భారత్ బంద్‌లో భాగంగా బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని దానిలో భాగంగానే దౌల్తాబాద్ మండలంలో వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించారన్నారు. ఎస్సీ వర్గీకరణ అనేది పార్లమెంట్‌లో బిల్లు పెట్టి మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు చట్టం చేసి రాష్ట్రపతి ఆమోదం తర్వాత సుప్రీంకోర్టు చేసే అధికారం ఉందని స్వయంగా సుప్రీంకోర్టుకు వర్గీకరణ చేసే అధికారం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భారత్ బంద్‌కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు బైండ్ల నరేష్, బొల్లం అశోక్, దయాకర్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని పాఠశాలల్లో మాలమహానాడు అధ్వర్యంలో బుధవారం భారత్ బంద్ నిర్వహించారు. మాలల ఆత్మ గౌరవం కోసమే భారత్ బంద్ నిర్వహించామని.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని మాలమహానాడు మండలాధ్యక్షుడు సంగెం రూపేశ్ తెలిపారు. మాలమహానాడు సాంస్కృతిక సారథి ఎలుక దేవయ్య, సంగెం ఎల్లయ్య, కాల్వ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో బుదవారం చేపట్టిన బంద్ చేర్యాలలో విజయవంతం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను, వాటి ఉప కులాలను విభజించి పాలించే ఆలోచన మానుకోవాలని, సుప్రీం కోర్టు తీర్పుని వ్యతిరేకిస్తూ చేర్యాల పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా మాలమానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వ్యతిరేకిస్తూ పార్లమెంట్లో 1/3 మెజారిటీతో చేయాల్సిన చట్టాన్ని సుప్రీంకోర్టు ఏకపక్ష తీర్పు ఇవ్వడాన్ని విమర్శించారు. దీని వల్ల ఎస్సీలకు, ఎస్సీ ఉప కులాలకు తీరని అన్యాయం జరుగుతుందని, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో యువత నష్టపోతుందని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరుచుకొని ఎస్సీలను విభజించి పాలించే ఆలోచన ధోరణి మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ మల్లయ్య, జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, ప్రచార కార్యదర్శి మేడిపల్లి నరసింహ ,నియోజకవర్గ ఇన్చార్జి శ్రీరామ్ వెంకటేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చంద శ్రీకాంత్, చేర్యాల మండల కన్వీనర్ గుస్క గోవర్ధన్, యూత్ నియోజకవర్గ ఇన్చార్జి పాకనాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ రాజకీయాలకు సిద్దిపేటలో తావు లేదు

- బీజేపీ పట్టణ అధ్యక్షులు కోదూరు నరేష్

నవతెలంగాణ-సిద్దిపేట

8 నెలల కాంగ్రెస్ పరిపాలనలో సిద్దిపేట నియోజకవర్గానికి ఏమీ రాక, ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేటకు ఎలాంటి నిధులు తేలేక, చేతకాక రెండు రాజకీ య పార్టీలు సిద్దిపేటలో అలజడ ులు సృష్టిస్తున్నారని, రౌడీ రాజకీయా లకు సిద్దిపేటలో తావు లేదని బీజేపీ పట్టణ అధ్యక్షులు కోదూరు నరేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన హరీశ్ రావు ఒక్క నయా పైసా తీసుకురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వీరిద్దరూ ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటలో అలజడులు తీసుకొచ్చారని, గూండా రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను పట్టించుకోవాలని కోరారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పుస్తె మట్టెల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబస్తురాలు నవ్య వివాహం కోసం చంద రమేష్ చైతన్యాల దంపతుల సహకారంతో పుస్తె మట్టెలు అందించినట్లు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చకిలం రవి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా నిరుపేదలకు సహాయం చేయడంలో వాసవి క్లబ్ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ తోట విశ్వం, కోశాధికారి ఇల్లెందుల నాగేందర్, హరి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

నవతెలంగాణ- గజ్వేల్

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో చిక్కుడు కిరణ్ అకాల మరణం చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కుడు కిరణ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టికి తీసుకపోతానని ఆయన చెప్పారు. ఆ కుటుంబానికి మూడు వేల ఆర్థిక సాయం అందించారు.



మత్తు పదార్థాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-నార్సింగి

మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల పై మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల దుష్పరినామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అహ్మద్ మాట్లాడుతూ యువత, చెడు స్నేహాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తును అలవాటు చేసుకుని తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదని సూచించారు. మాదక ద్రవ్యాలు వాడకం వలన శరీర అవయవాలు చెడి పోతాయని, ఆరోగ్యం దెబ్బతిని అనేక ప్రాణాంతక వ్యాధుల బారిన పడతారని అన్నారు. మత్తు పదార్థాలు వాడే వ్యక్తులు మానసికంగా చాల కృంగి పోతారని, నాడీ వ్యవస్థ పై ప్రభావం పడి ఆరోగ్యం క్షీణించి జీవితం దయనీయంగా మారుతుందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ చాలా కీలక మైనదని యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటిస్తూ చక్కగా చదువుకొని దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని, తమ జీవితాన్ని బంగారు మయంగా మార్చుకోవాలని సూచించారు.



తల్లిదండ్రులు కూడా తమ పిల్లల వ్యవహార శైలిని పరిశీలిస్తూ ఉండాలని, చెడు స్నేహాలకు వ్యసనాలకు అలవాటు పడకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికై కమిషనర్‌కు వినతి

తక్షణమే 11వ వార్డు అభివృద్ధిపై దృష్టి సారించాలి
లేనిపక్షంలో మెదక్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేస్తాం

నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ బొంది అరుణ వెంకట్ గౌడ్ బుధవారం తన వార్డులోని పలు సమస్యల గురించి కమీషనర్ ఖాజా మొయినుద్దీన్ కు వినతి పత్రాన్ని అందచేసినారు. 11వ వార్డును శానిటేషన్ ద్వారా పరిశుభ్రంగా ఉంచే సఫాయి కార్మికులు ఇంతకుముందు చురుకుగా శానిటేషన్ కార్యక్రమాలు చేసేవారు. కానీ నేడు దానికి విరుద్ధంగా ఒకరు లేక ఇద్దరితో సూచి శుభ్రత కార్యక్రమాలు చేయడం ద్వారా పలు వీధులలో ఎక్కడి చెత్త అక్కడే ఉందన్నారు. చెత్త సేకరించే వాహనం ఇదివరకు ప్రతినిత్యం వస్తుండేది. వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోతుంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు వ్యాపించి ప్రజలు రోగాల బారినపడతారని, దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్, నిబాసిన్ పౌడర్ లాంటివి చల్లడం లేదని, వీధి దీపాలు ఉన్నా అవి వెలగడం లేదని, వాటిని సరి చేయడం లేదని, కొత్తగా అవసరమైన ప్లేస్‌లో ఏర్పాటు చేయాలని కోరినారు. గత ప్రభుత్వంలో వేసిన సీసీ రోడ్డుపైన మంజూరైనప్పటి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం కారణంగా ప్రజలు జారీ పడుతున్నారన్నారు. స్కూలుకు వెళ్లే విద్యార్థిని విద్యార్థులు పడరాని పాట్లు పాటుపడుతున్నారని వినతి పత్రాన్ని అందించారు. తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎంట్రన్స్‌లో గతంలో డివైడర్ పక్కన రోడ్డు పనులు జరిగినప్పుడు రోడ్డు గుంతల మయంగా మారితే కమిషనర్ దృష్టికి పట్టించుకోలేదని వెల్లడించారు. కౌన్సిలర్ సొంత నిధులు వెచ్చించి మట్టి ద్వారా రోడ్డులో మరమ్మతులు చేయడం జరిగిందని, ఇదీ ఒక వార్డు సమస్యయే కాదు ఇటువైపుగా వెళ్లే గ్రామాలు వట్టూరు, నాగులపల్లి వెళ్లే ప్రయాణికులు నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ప్రజల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఏర్పాటు చేసిన లైట్లు ఆన్



చేయవలసిందిగా కోరడం జరిగింది. కమిషనర్ వెంటనే స్పందించి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని, మున్సిపల్‌లో విలీన గ్రామమైన 11వ వార్డు పడాలపల్లిన్ని అభివృద్ధి చేయాలని వార్డులోని ప్రజలు కౌన్సిలర్ ను కోరుతూ బుధవారం వినతిపత్రం కమిషనర్ కు ఇవ్వడం జరిగింది. అప్పటికి పట్టించుకోకపోతే రాబోయే వారం రోజుల్లో అవసరమైతే కలెక్టర్ వద్దకు వెళ్లినా మా సమస్యలు పరిష్కరించుకునేందుకు వార్డు సభ్యులను కలసికట్టుగా పోరాడుతామని వివరిస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఈ వినతి పత్రాన్ని నిర్లక్ష్య పరచి పడాలపల్లి విస్మరించినట్లయితే రాబోయే పరిణామాలకు బాధ్యత వహించాల్సిందిగా 11వ వార్డు కౌన్సిలర్, ప్రజలు వెల్లడించారు.

డెంగ్యూ వ్యాధి సోకి యువకుడు మృతి



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన నంద్యాల సిద్ధి రాములు కుమారుడు శివ (24) గత వారం రోజుల నుంచి డెంగ్యూ వ్యాధి సోకడంతో హైదరాబాదులోని రెనోవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.

భూ వివాదాలతో కొట్టుకున్న వారిపై కేసులు నమోదు

నవతెలంగాణ-నార్సింగి

పాత కక్షలతో సమీప బంధువులు గొడవ పడి గాయాలపాలైన రెండు సంఘటనలు మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నాయి. ఇరు ఘటనల పై కేసు నమోదు చేసిన స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ కేసు వివరాలను తెలుపుతూ నార్సింగి ఎస్సీ కాలానికి చెందిన దెబ్బిట నర్సింలు దెబ్బిట కుమార్‌లకు పాత గోడల వద్ద గల భూమి గురించి వివాదం ఉంది. మంగళవారం సాయంత్రం 6:30 ప్రాంతంలో దెబ్బిట నర్సింలు నార్సింగిలోని మద్యం దుకాణం వద్ద దెబ్బిట పెంటయ్య, ఎర్గమెల్ల పెద్దకిష్టయ్యతో పాటు నిలబడి మాట్లాడుతుండగా అక్కడికి జోగు నర్సింలుతో పాటు చేరుకున్న దెబ్బిట కుమార్ పాత కక్షలతో తనకు భూమి ఇవ్వాలంటూ దెబ్బిట నర్సింలు, దెబ్బిట పెంటయ్య, ఎర్గమొల్ల పెద్దకిష్టయ్య పై తన వికలాంగుల కట్టెతో, పిడి గుద్దులతో దాడి చేసి గాయపరిచారు. దెబ్బిట నర్సింలు ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ మరో ఘటన వివరాలను వెల్లడిస్తూ మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన తాళ్ళ సురేష్ గౌడ్, తాళ్ళ శ్రీనివాస్ గౌడ్ సోదరులు. వీరికి భూమి విషయంలో పాత గొడవలు ఉన్నాయి. ఇదిలా ఉండగా సురేష్ గౌడ్ మంగళవారం ఉదయం 9:30 గం ప్రాంతంలో ఇంటి స్లాబ్ పై నిలిచిన వాన నీటిని తొలగించేందుకు ఏర్పాటు చేసిన పైపు ను శుభ్ర పరచడానికి ఎక్కి శుభ్ర పరిచి క్రిందికి దిగాడు. అనంతరం రాత్రి 9:30 గం ల ప్రాంతంలో అతని సోదరుడైన శ్రీనివాస్ గౌడ్ తన కొడుకు అయిన తాళ్ళ సాయి వివేక్ గౌడ్‌తో పాటు సురేష్ గౌడ్ ఇంట్లోకి చొరబడి ఇంటి పైకి ఎందుకు ఎక్కవు అంటూ బూతులు తిడుతూ సురేష్ గౌడ్, అతని భార్య లక్ష్మి లను కట్టెతో కొట్టి గాయపరిచారు. గొడవ జరగడాన్ని గమనించిన వారి తండ్రి అయిన తాళ్ళ బాల గౌడ్ సముదాయించడానికి ప్రయత్నించగా శ్రీనివాస్ గౌడ్ తన తండ్రిని కొట్టి కింద పడేసి గొంతు పిసుకుతూ చంపుతానంటూ బెదిరించాడు. సురేష్ గౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపారు.

7,295 మంది రైతులకు రుణమాఫీ

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండలంలో ఇప్పటివరకు మూడు విడతలుగా 7,295 మంది రైతులకు గాను రెండు లక్షల వరకు రుణమాఫీ జరిగిందని వ్యవసాయ మండల అధికారి దీపిక అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కొంతమంది రైతులకు పాసుబుక్ లేనందున, అకౌంట్ క్లోజ్ అవ్వడం వల్ల, రుణం తీసుకున్న రైతు చనిపోవడం వల్ల, అసలు తీసుకున్న రుణం కంటే వడ్డీ ఎక్కువగా ఉండడం ఆధార్‌లో పేరు ఖాతాలో పేరు వెరు వెరు గా ఉండడం వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదు అన్నారు. అటువంటి రైతులు రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు

నిందితులను కఠినంగా శిక్షించాలి

శ్రామిక్ భవన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ, నిరసన
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి పాండురంగారెడ్డి



నవ తెలంగాణ - పటాన్ చెరు

కలకత్తా లో జూనియర్ డాక్టర్ ను హత్యా చారం,హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ పటాన్ చెరు ఏరియా కమిటీ అధ్వర్యంలో పట్టణంలోని శ్రమిక్ భవన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలి నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పి.పాండురంగరెడ్డి మాట్లాడుతూ కలకత్తా అర్జియర్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్ మౌమిత దెబ్నాథ్ విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో గత 10 రోజుల క్రితం హత్యా చారం చేసి, హత్య చేశారని అన్నారు.ఇప్పటివరకు నిందితున్ని శిక్షించలేదని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం,బెంగాల్ ప్రభుత్వం నిందితులకు అండగా నిలిచే ప్రయత్నాలు చేస్తున్నారు అని అన్నారు.ఎఫ్ ఐ ఆర్ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆత్మ హత్యగా చిత్రీకరించే కుట్ర చేశారని అన్నారు.ప్రిన్సిపాల్ ప్రవర్తనలో అనుమానాలు ఉన్నాయన్నారు.బెంగాల్ ప్రభుత్వం అక్కడ శాంతియుత ధర్నాలు చేస్తున్నవారిని అణచి వేసిందని అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.లేనిచో ఆందోళనను మరింత తీవ్ర తరం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు,సీఐటీయూ నాయకులు ఎంజీవీఎస్ ప్రసాద్, సదశివరెడ్డి, మనిరాజు, గంగాధర్, మూర్తి, రాములు, నరేష్, రాము, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై సీఈఓ సమీక్ష



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలోని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలపై ప్రత్యేక రివ్యూ సమావేశంను మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో సి హెచ్.ఎల్లయ్య బుధవారం రోజున నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేషాద్రి, ఎంపీఓ సతీష్, జూనియర్ అసిస్టెంట్ సుభాషిని, పంచాయతీ కార్యదర్శులు ఎన్.కల్పన, అరుణ, కల్పన, లావణ్య, సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను కలిసిన వీరభద్ర

నవతెలంగాణ-తూప్రాన్



బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను ఆశాజ్యోతి సేవా సంస్థ కోఆర్డినేటర్ వీరభద్ర బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వీరభద్ర పల్లవి ప్రశాంత్‌తో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో అనాథ పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సేవా కార్యక్రమాలు అందించాలని కోరడంతో స్పందించిన పల్లవి ప్రశాంత్ త్వరలోనే కార్యాచరణ రూపొందించి, ప్రణాళిక తయారు చేద్దామని హామీ ఇచ్చారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నార్సింగి



రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డు పై పీఏసీఎస్ సొసైటీ దగ్గర జరిగింది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం వల్లభాపూర్ తాండాకు చెందిన నేనావత్ మంగ్యా నాయక్ (45) నార్సింగి మండల కేంద్రంలో తన స్వంత పని ముగించుకుని వల్లభాపూర్ కు బయలు దేరి వెళుతుండగా చేగుంటకు చెందిన మాస శంకర్, సోమ శేఖర్ తో పాటు నార్సింగి లో జరిగిన పెళ్లి కార్యక్రమంలో పాల్గొని తమ ద్విచక్ర వాహనం పై తిరిగి వెళ్తూ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డు పై పీఏసీఎస్ సొసైటీ సమీపంలో మంగ్యా నాయక్ వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టాడు. బలంగా ఢీ కొట్టడం వల్ల మంగ్యా నాయక్ అదుపు తప్పి రోడ్డు పై పడిపోగా ముక్కు భాగంలో తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక వాహనం నడుపుతున్న మాస శంకర్‌కు గాయాలయ్యాయి. మృతుడు మంగ్యా నాయక్‌కు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు, భార్య ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రునికి చికిత్స నిమిత్తం ఆసుపత్రి కి పంపి, మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సీజనల్ వ్యాధులపై జెడ్పీ సీఈవో ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో సి హెచ్.ఎల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం రోజున తూప్రాన్ మండల పంచాయతీ కార్యదర్శులతో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ ఎల్లయ్య మాట్లాడుతూ సమావేశమై వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో తగు జాగ్రత్తలు తీసుకునుటకై సూచనలు సలహాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామల్లో పారిశుధ్య కార్యక్రమాలు రోజువారీగా చేయాలని సూచించారు.మండల ప్రజలకు అవగాహన చేయాలని, ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలని, ప్రజల తో ఫ్రైడే పై అవగాహన చేస్తూ ప్రజలతో డ్రై డే చేపించాలని, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, ఎంపీఓ సతీష్, జూనియర్ అసిస్టెంట్ సుభాషిని, పంచాయతీ కార్యదర్శులు కల్పన, అరుణ, సతీష్, సంతోష్, శ్రీనివాస్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

